VOL. 2 : NO. 2

SEP 1



6

ఆనందదాయకమైన

# ప్రారంభదినము

విజయదశమి రోజున

**5-10-46**

ఆంధ్రదేశము, తమిళనాడు అన్ని
ముఖ్యకేంద్రములలో విడుదల





SRI RENUKA FILMS L<br>MADRAS

# త్యాగయ్య

నాగయ్య
నటించిన
అమర చిత్ర
కళాసృష్టి

డైరక్షన్ - నాగయ్య

నిర్మాతలు: శ్రీ రేణుకా ఫిలింస్ లిమిటెడ్

16, డాక్టరు నాయర్ రోడ్, త్యాగరాయనగర్, మద్రాస్.



# GRIPE-COL

**(For Children's Disorders)**

**A MECLEC PRODUCT**

## మెక్ లెక్
# గ్రైప్-కాల్

శిశువులయొక్క, పసిబిడ్డలయొక్క ఆరోగ్యము, అభివృద్ధికిగాను ఉపయోగించు రుచికరమగు పానీయము.

పిల్లలకు సాధారణముగా వచ్చు అజీర్తి, కడుపుబ్బరము, కక్కులు, విరేచనములు, పళ్లు మొలచునపుడు కల్గు నల్తలు మొదలగు వానిని పోగొట్టుటకు మిక్కిలి ఉపయోగించును.

మీ బిడ్డలను ఆరోగ్యవంతముగ నుంచుటకు గ్రైప్-కాల్‌ను తప్పక వాడుడు.

అన్ని మందుల షాపులలోను దొరకును.

కంపెనీనుండికూడ వ్రాసి తెప్పించుకోవచ్చును:

**The Meclec Nutriments & Pharmaceuticals Ltd.,**

99-A, Armenian St., .. G. T. Madras

ఆంధ్రదేశంలోని ప్రధాన కేంద్రములలో

## సెప్టెంబరులో విడుదల!



సారథి వారి

# గృహప్రవేశం

**భానుమతి.... సి యస్. ఆర్... ప్రసాద్**

**హేమలత... శ్రీరంజిని... శివరావు... రంగస్వామి**

**DIRECTED by PRASAD**

Studio NEWTONE

కథ, సినేరియో, డైలాగ్సు:
గోపీచంద్

పాటలు, సంగీతం:
నళినీకాంతరావు

*For Particulars:*

**M/s SARATHI FILMS LIMITED**

THYAGARAYANAGAR :: MADRAS




ఏ ఇతర రకాన్నైనా ధిక్కరించగల

పెన్సిల్ కార్బన్ కాగితం!

అరటావు సైజు,

ఒక ప్రక్క మబ్బురంగు

చిల్లర: టోకు వ్యాపారానికి విచారించుడు:

**V. PERUMALL CHETTY & SONS**
**5. STRINGERS ST., G.T. MADRAS.**

# పిల్లలకు ఒక కథ
## వెంబడిపడుట — పట్టుకొనుట



అమ్మ నీళ్ల పోసుకొనుటకు పిలిచినప్పుడు నేను ఎప్పుడు పారిపోతూ ఉండేవాణ్ణి.



లేక

తప్పించుకొనే విధము లేకపోతే తిన్నగా నీళ్ల పోసుకోకుండా ఉండడానికి గట్టిగా ప్రయత్నించేవాణ్ణి. ఎందువల్లనంటే, నీళ్ల అంటే నాకు అసహ్యంగా ఉండేది,



కాని,

హమామ్ సబ్బు నాకు ఇచ్చినందువల్ల నీళ్ల పోసుకోవడం అంటే నాకు మంచి సరదాగా వుంది. హమామ్‌సోపు పెద్ద బిళ్లతో నీవు చక్కని బుడగలు తేగలవు. దానికి మంచివాసన కూడా వుంది. అందువల్ల ఇప్పుడు అమ్మ ఎప్పుడు నీళ్ల పోసుకోడానికి రమ్మన్నా నేను వెళ్లతాను. కొంచెంకూడా సందేహించను.




ధరతరోజులు మక్కువతోవాడే సబ్బు

ది తాతా ఆయిల్ మిల్సు కం. లి. వారిచే

తయారు చేయబడినది.




**'BALA'** CHILDREN'S ILLUSTRATED MONTHLY

సంపాదకుడు : **న్యాయపతి రాఘవరావు, బి.ఎ.**

సహాయ సంపాదకురాలు : **న్యాయపతి కామేశ్వరి, బి.ఎ., ఎల్.టి.**

**సంపుటి 2.]** మదరాసు, సెప్టెంబర్, 1946 [**సంచిక 2.**

# స్వరాజ్యానికి తలుపులు తెరువబడ్డాయి !


"బాల" రెండోఏడు ప్రారంభించగానే మనకి స్వరాజ్యం వచ్చింది. ఇన్నాళ్లూ మన రాజ్యం బ్రిటిషువారిచేతుల్లో వుండేది. కాని, సెప్టెంబరు రెండవ తేదీనుండీ మనరాజ్యం విషయాలు పూర్తిగా మనకే వదిలేశారు. అంటే — స్వరాజ్యం అన్న మన కోట తలుపు తాళాలు మనకి యిచ్చారు. ఆ తాళాలతో మనకోట తలుపులు తెరిచి, మనం మన రాజ్య వ్యవహారాలు పూర్తిగా చక్కబెట్టుకొని, అనుభవించాలి. ఇన్నాళ్లకి మనకి పూర్తిగా స్వరాజ్యానికి దారి కనబడుతోంది. అందరం—అంటే హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, అందరూ ఆ దారివెంబడి ఐకమత్యముతో వెళితే పూర్ణ స్వరాజ్యం పొందుతాం.

మన స్వరాజ్యానికై ఎన్నో ఏండ్లనుండి పాటుపడిన మన కాంగ్రెసునాయకులకు మన 'బాల' జేజేలు.

# బొమ్మరిల్లు మనదే!

బాలా! బాలా! పరుగున రావె
బొమ్మ రిల్లంతా మనదే నింక
ద్వారాలన్నీ తెరువబడ్డాయి
ఆశలన్నియు తీర్చబడ్డాయి
చవితి పిమ్మట మూడవనాడు
చరకా భక్తుడు జహ్వారుబాబు
ఎగురవేసె మన జాతి పతాకం
స్వేచ్ఛవాయువుల పీల్చా నేను
మూడురంగుల ముచ్చటి జండా
పంచరంగుల బొమ్మరింటి పై
వేడుకమీర ఎగురుచున్నది
అహింస సూత్రం, పతాక మహత్యం
స్వతంత్ర లక్ష్మికీ సుస్వాగతం!
మన ప్రభుత్వానికి మంగళారతులు.

రచన: పమ్మి వీరభద్రరావు. (పిప్పర)



# తకిలీ!

తిరుగు తిరుగూ తకిలి
తిరగవే తకిలీ!
తిరిగి దారిద్ర్యంబు
బాపవే తకిలీ!


చిన్నిబాలలు మాదు
చిన్నిచేతులలో
తిన్నగా తిరుగవే
ఓచిన్ని తకిలీ!
కటు గుడ్డకు మాకు
కరవయ్యె తకిలీ!
గట్టి దారము నిచ్చి
బట్టలను ఇమ్మా!

రచన: వై. సత్యనారాయణరావు (నూజివీడు)

# చందమామ పాట

సంపాదన: సి. బాలంభొట్లు (నర్సాపురం)

చందమామ చందమామ - ఓ చందమామా!
చందమామ కూతురు - చంద్రగిరి కన్నె
చంద్రగిరి కన్నెకు - నిండుపూలతోట
పూసింది మున్నూరు - పూవుల్లతోట
కాసింది మున్నూరు - కాయల్లతోట
పండింది మున్నూరు - పండుల్లతోట
అందులో ఒక పండు - అందమయినపండు
ఆ పండు దాపున - జీడిగించమొలచె
జీడిగింజ జిడ్డితలుపు - నే తీయలేను
నాకంటె నా చెల్లి - అతిముద్దరాలు
అతిముద్దరాలి చేత - పాలుకాగపెడితే
పాలుమీద తేలింది - పగడాలపేరు
పగడాలపేరు తెచ్చి - కోమటింటపెడితే
కోమటోడు పెట్టాడు - గోరంచుచీరె
ఊరివారు పెట్టారు - ఉల్లిమళ్లచీరె
మావారు పెట్టారు - మల్లిమొగ్గలచీరె.




# వాహనాలు

దేవేంద్రునకూ వాహనమేది ?

తెల్లఏనుగే వాహనము.





బ్రహ్మదేవునకు వాహనమేది ?

తెల్లని హంసయె వాహనము.

కుడుములగణపతి వాహనమేది ?

మూషికరాజే వాహనము.






వెన్నకృష్ణుడీ వాహనమేది ?

గరుత్మంతుడే వాహనము.

గౌరీదేవీ వాహనమేది ?

మృగములరాజే వాహనము.





చక్కని శివునీ వాహనమేది ?

వృషభమె మేటీ వాహనము.

బొమ్మలు : "బాపు"  రచన : ధూళిపాళ్ల కృష్ణమూర్తి.

# దొంగ మార్కెట్టు

రచన: ఇంజేటి సుందరమ్మ

బాల:- నాన్నగారూ! నేను యిన్ని రోజులనుండి అడుగుతూ వుండినా నాకు బడిలో రాసుకొనేందుకు ఒక 'ఫౌంటెన్ పేనా' కొనిపెట్టరు! పోనీ, నాకొక మంచి జాకెట్టుగుడ్డ కొనమంటే బజారులో లేదనేస్తారు! ఏవస్తువు కావలెనన్నా అదేజబాబు. నన్ను చూస్తే మీకు గిట్టదు కాబోలు.

నాన్న:- నీమీద గిట్టక కాదమ్మాయీ. ఏకొట్టుకు వెళ్ళి అడిగినా సరుకు లేదంటారు. అన్నిటికీ 'కంట్రోలు' అంటారు. పనులన్నీ విడిచి దినమంతా తిరిగినా ఒక్కటీ దొరుకదు. నేనేంచేసేది?

బాల:-మీరు చెప్పేది సమాధానం నమ్మదగినదిగాదండీ. మా బడిలో యెంతోమంది పిల్లలు రకరకాల పేనాలు కొత్త కొత్త నమోనాలు యెన్నో తెచ్చుకొంటున్నారు. మంచి మంచి రంగుల బట్టలంతా వేసుకొస్తుంటారు. వారిని అడిగితే వాళ్ల నాన్నగార్లు యెట్లో సాధించి తెచ్చినారని చెప్తారు. లేని దరిద్రమంతా నాకే చుట్టుకొన్నట్టుంది.

నాన్న:-నీవంత కంగారు పడకమ్మా. నిజం తెలియజేస్తే నమ్మరు. బజారులో బయలు మార్కెట్టులో మంచి వస్తువులేమీ లేవు. బహుశా 'బ్లాకుమార్కెట్టు'లో కొంటున్నారేమో.

బాల:- పోనీ ఆ బ్లాకు మార్కెట్టుకే వెళ్ళి ఆమాత్రం నాకై కొనిపెట్ట లేరూ?

నాన్న:- ఆత్మగౌరవంగలవాళ్లెవరూ ఆ బ్లాకు మార్కెటుకి వెళ్లకూడదు.

బాల:- అదేమండీ. మూరు మార్కెట్టు, ఫ్రూటు మార్కెట్టు, యింకా యెన్నో మార్కెట్టులన్నిటిని నన్ను వెంటబెట్టుకొని తిరుగలేదా? అలాగే ఆ బ్లాకు మార్కెట్టుకుకూడా నన్ను తీసుకు వెళ్ళకూడదూ?

నాన్న:- 'బ్లాకు మార్కెట్టంటే దొంగబజా రమ్మా! దొంగ వ్యాపారంచేసే బజారు.

పెద్ద వ్యాపారస్తులు వస్తువులన్నీ కొని, రహస్యంగా దాచి, మనం అడుగుతే: 'లేవు. చెల్లిపోయినాయి సార్' అంటారు. మనకి వస్తువులు అవుసరం గనుక ధరలు పదిరెట్లు పెంచి రహాశ్యంగా అమ్ముతారు. బ్లాకు మార్కెట్ అంటే అది. గవర్నమెంటువారు నిర్ణయించిన ధరలకు అమ్మకుండా, వస్తువులు దాచేసి, ధరలుపెంచి, రహాశ్యంగా అమ్మడమే బ్లాక్ మార్కెట్.

బాల:- ఇప్పుడు తెలిసింది. ఈ బ్లాక్ మార్కెటువారు మనని మోసగిస్తున్నారు! ఛీ! ఇంకెప్పుడూ హెచ్చు ధరలిచ్చి కొనకూడదు. తెలుగు బాల లందరూ కట్టుగట్టి ఇకముందు యీ 'నల్ల మార్కెట్టులో కొనమని' ఒట్టు పెట్టుకుంటాము.

నాన్న:- మంచిది.



# అల్లరి ప్రకాశం -


## శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులు

### చిన్నతనం

**నేను** 1872 వ సంవత్సరంలో కనపర్తి గ్రామంలో మా మేనమామల ఇంట్లో జన్మించాను ... ఉపనయనం నాటికి నాకింకా 5 ఏళ్ళు పూర్తి కానట్టు మాఅమ్మగారు చెప్పింది. ఉపనయనం విషయంలో నాకు జ్ఞాపకం వున్నదల్లా అరుగుమీద కూర్చోపెట్టి సంధ్యావందనం చెప్పడం. మా పురోహితులైన పిల్లుట్ల చెంచయ్యగారు ఎంతో కష్టంమీద నన్ను అరుగుమీద కూర్చోపెట్టి సంధ్యావందనం చెప్పేవారు.

### తొడపాయసం

ఇక అప్పటి చదువువిషయం. నా అక్షరాభ్యాసం పల్లూరులో వెంకటప్పయ్య అనే ఆయన వీధిబడిలో. ఆయన నాకు ఓనమాలు నేర్పిన ఆదిగురువు. ఆయనవిద్యే నాకు మొదటి పునాదిరాయి. అయితే ఆయన శుశ్రూషవల్ల ఇప్పటికీ నాకు జ్ఞాపకం ఉన్న ఆనాటి తొడపాయసాలు! ఆయన చదవకపోతే చర్మం ఊడి చేతుల్లోకి వచ్చేటట్లు కొట్టేవాడు! అంతే కాకుండా నన్ను బడికి పంపడానికి మావాళ్ళు పడిన పాట్లుకూడా నాకు కొంచెం జ్ఞాపకం ఉన్నాయి. చేతులూ కాళ్ళూ కట్టి ఈడ్చుకువెళ్ళి బడిలో వెయ్య



డమూ, నేను ఆ బంధనాలు తెంచుకోవడమూ కూడా నాకు బాగా జ్ఞాపకం!

### అల్లరి పిల్లలలో ఫస్టు

నాయుడుపేటలో నేను ఆలీబేగ్ అనే ఒక సాహేబుల కుర్రవాడితో కలిసి ఉర్దూ చదవడం జ్ఞాపకంవుంది. అక్కడ చదువుకొనే రోజుల్లో నేను

# ప్రధాని ప్రకాశం



## గారి "నా జీవితయాత్ర" నుండి

బుద్ధిమంతుడ్ని అనిపించుకున్నానని చెప్ప వీలులేదు. వయస్సు ఎంతో లేక పోయినా, స్కూలులో ఉన్న అల్లరి పిల్లలలో మనపేరు మొదటిదిగా వుండేది.

## మొట్టికాయలు

నాకు, ఎక్కడికి వెళ్ళినా రెండు రకాల మిత్రులు స్నేహాలు తటస్థపడుతూ ఉండేవి. పరమ పోకిరీల స్నేహం ఒకవైపున! బుద్ధిమంతులు, సంపన్న గృహస్థులు, విద్యావంతులు మొదలైన పెద్దవాళ్ళ స్నేహం రెండోవైపున! కానూరి రంగడు అని ఒకడు ఉండేవాడు. అతని అసలుపేరు రంగారావు. అతను మాధ్వుడు. అతనితో మొదటి స్నేహం సాము, గరిడీ, కుస్తీలు, చెడుగుళ్లు మొదలైన వాటిల్లో. అత నొక చిత్రమైన మనిషి. రోజూ అతను సువర్ణముఖిఒడ్డున ఉండే ఆంజనేయ స్వామికి కోడిగుడ్లు నైవేద్యం పెట్టి ఆప్రసాదం అందరికీ ఇస్తూండేవాడని ప్రతీతి. చాలా మంది 'అతను దుర్మార్గుడు; చదువూ సంధ్యా లేనివాడు; అల్లాంటి వాడితో నీకు స్నేహం ఏమి?'టని నన్ను మందలించేవారు. నాకు అతని స్నేహంవల్ల అలవాటయినవి బడిపిల్లలిని ఏడిపించడం, వాళ్ళ పుస్తకాలు పారవెయ్యడం, ఉపాధ్యాయుల్ని, ఉడికించడం మొదలైన ఘనకార్యాలు!

ఒకసారి పుదూరు సుబ్రహ్మణ్యయ్యరు అనే మాష్టరుగారు బోర్డువైపు తిరిగి లెక్కలు చెబుతూ ఉండగా నేను వేళ్లాడుతూ వున్న ఆయన గోచీ కుర్చీకి కట్టాను. దాంతో బెత్తాలదెబ్బలు, మొట్టికాయలు మొదలయిన శిక్షలన్నీ సంపాదించాను! అంతేకాదు! నన్ను స్కూలులోంచి డిస్మిస్ చేశారు. ఈ సంగతి మా నాయనగారికి తెలిసి ఆయన ఆ రోజుల్లో అక్కడ డిప్యూటీ కలెక్టరుగా వుండే ఆడక్కి నారాయణ రావుగారి నాశ్రయించగా, ఆయన దయవల్ల మళ్ళీ స్కూల్లో ప్రవేశించాను.

కాని మరి కొద్దిరోజులకే ఇంకొక తవ్వాయి వచ్చింది! అప్పట్లో అల్లాడి ఆదెయ్యకొడుకు సూర్యనారాయణ అప్పర్ మిడిల్ క్లాసు చదువుతూ ఉండేవాడు. ఆయన నన్నేదో తిరస్కారంగా మాట్లాడి కొట్టేసరికి నేను

అతని ఇంగ్లీషు టెక్స్టుపుస్తకం ఎత్తుకు పోయి స్వర్ణముఖి ఒడ్డున ముక్కలు ముక్కలుగా చింపేశాను. ఆ చింపడం నా వెనకాలే వున్న యానాది వాడొకడు చూసి, నేను చింపి పారవేసిన కాగితం ముక్కలన్నీ తెచ్చి నా వెనకాలే స్కూల్లో అప్పజెప్పాడు. దాని ఫలితంగా నాకు మళ్ళీ బెత్తం ప్రహరణాలు జరిగింది. డిస్మిసు చేశారు. తిరిగి ఆ డిప్యూటీ కలెక్టరుగారి మూలంగానే ఆ స్కూల్లో పునఃప్రవేశం లభించింది.

## ఇంగ్లీషు చదువు

1884 సం॥ లో ఇంగ్లీషు చదువు కోసం ఒంగోలు చేరుకున్నాం. అప్పటికి నా వయస్సు 12 సంవత్సరాలు. అప్పటికి గవర్నమెంటు మిడిల్ స్కూల్లోనే అప్పర్ ఫోర్తు దాకా చదివాను అక్కడనించే మిడిల్ స్కూలు పరీక్షకి హాజరై మొదటి తరగతిలో ఉత్తీర్ణుణ్ణయ్యాను.

అప్పటి హెడ్మాస్టరు, సుందర శివయ్య అనే ఆయన, కొంచెం చదివితే పనికొచ్చే పిల్లల్ని ఇంటికి తీసుకువెళ్ళి వాళ్ళకి ప్రత్యేకంగా చదువు చెప్పేవాడు. అల్లాంటి వాళ్ళల్లో నేను ఒకణ్ణి. అక్కడ కూడా ప్రవర్తనవిషయంలో మనకి మామూలు యోగ్యతాపత్రికే సంప్రాప్తమైంది! పోకిరీపిల్లల సహవాసం, జబర్దస్తీ, మాష్టర్లని ధిక్కరించటం మొదలైన గుణాలు మన్ని వదలనే లేదు! బొంగరాలు, గోలీలు, మొదలయిన ఆటల్లో మనది అందివేసిన చెయ్యి! సామాన్యంగా చెడుగుడు ఆటకి పెండేసి బద్దని నేనే! క్రికెట్టు ఆటలో రెండు జట్లుండేవి. ఒక జట్టులో నా పేరు ప్రధానంగా వుండేది. ఇంతకీ ఈ ఆటలకి డబ్బు కావాలి గదా! ఆ డబ్బు మనదగ్గిర లేదు! అందుచేత అల్లాంటివాళ్ళం అంతా కలిసి, చిన్న ముఠాగా చేరి, బజారులో వస్తువులమ్మే వాళ్ళ కళ్ళల్లో కారంకొట్టి డబ్బు సంపాదించేవాళ్ళము! నిరంతరం ఈ డబ్బు కోసం తడుముకోవడమే ఒక ఆలోచనగా ఉండేది.

ఒక రోజున మా ముఠా అంతా చేరి, 'ఈ డబ్బు సంపాదించడం ఎల్లాగా?' అనే ఆలోచనలో పడ్డాము. మా ముఠాలో అద్దేపల్లి అప్పడు అనే అతను మంచి గట్టివాడు. ముఠా కంతటికీ ఏకైక నాయకుడు! మేమంతా కలిసి అతని నాయకత్వం కింద డబ్బు సంపాదించడానికి ఒక పన్నాగం పన్నాము. ఒంగోలికి చేరిఉన్న రంగారాయుడు చెరువుకింద పొలంలో వరిగె పండి కోతకి సిద్ధంగా వుంది. మేము రాత్రి రాత్రి ఆ పంట కోసి, అమ్మి, డబ్బు సంపాదించడానికి నిశ్చయించి, రాత్రి 12 గంటలకి కోత ముగించి, కట్టలు కట్టి నెత్తిని పెట్టుకున్నాము. ఇంతలో ఆ కాపలావాడికి మెలకువ రావడమూ,

వాడు కేకలు పెట్టగా నలుగురూ లేచి మమ్మల్ని పట్టుకోవడమూ జరిగాయి.

అప్పట్లో మా జట్టు నలుగురు. ఆ నలుగురిలో నేనే చిన్నవాణ్ణి. మాలో మస్తాన్ అని ఒక సాహేబుల కుర్ర వాడు వున్నాడు. మేము కొంతసేపు ధైర్యసాహసాలతో ప్రతిఘటించాము: కాని, చివరికి దొరికి పోయాము. వాళ్లు మమ్మల్ని పట్టుకుని పోలీసులికి అప్ప జెప్పే లోపల మా పెద్దవాళ్లు నలుగురూ వచ్చి వాళ్ళపంట వాళ్ళ కిప్పించారు. ఇంతకీ చేను కోతకి సిద్ధంగా వుందిగదా! ఆ రయితుకి ఖర్చులేకుండా కోత అయిందని పెద్దమనుష్యు లంతా తగాదా తీర్చారు!

## నాటకాలు

నేను నాటకాల్లో పాత్రధారణ ప్రారంభించి, ఆడవేషాల్లో కొంచెం పేరుప్రఖ్యాతులు సంపాదించాను. పీష్వా నారాయణరావువధలో నారాయణరావు పాత్ర నేనే ధరించేవాణ్ణి, అందులోనే మనకీర్తి బాగా వ్యాపించింది! వుండదల్లీ సాహేబు మేనల్లుడు ఒకడు మాతో వేషాలు వేసేవాడు. ఎప్పుడూ నాకు తురకల సహవాసం వుంటూనే వుండేది. ఆ ఉండదల్లీ సాహేబు ఉర్దూలో పండితుడు. ఆయన ఉర్దూలోనే నాటకాలు వ్రాసేవాడు. మేము తెలుగు లిపిలో ఆ ఉర్దూ వ్రాసుకుని నాటకాలు కంఠస్థంగా వల్లించేవాళ్ళము. ఈ స్థితిలోనే ఒక వైపున నాటకాలూ, రెండోవైపున చదువూ సాగిస్తూ, నేను మిడిల్ స్కూలు పరీక్షకి తయారు కావలసివచ్చింది.

నేను ఈ నాటకాల్లో తిరుగుతూ ఉంటే మా అమ్మగారు, అమ్మమ్మగారు కూడా చాలా బాధపడుతూ వుండేవారు. కాని నే నెప్పుడూ వారి అదుపు ఆజ్ఞల్లో లేకుండా ఉండడంవల్ల నన్నేమీ చెయ్యలేకపోయేవారు. నేను చేసే అకృత్యాలన్నీ కాసుకుంటూ వచ్చేవారు. బయట ఎంత అల్లరి చేసినా స్కూల్లో చదువు విషయంలో ఏలోపమూ లేక పోవడంవల్ల కొంత తృప్తిపడుతూ వుండేవారు.

## ప్లీడర్ల లాంకోటు

ఒంగోలులో మా ఇల్లు మునసబు కోర్టుకి ఎదురుగా వుండేది. ఆ కోర్టులో ప్లీడర్లు లాంగుకోట్లు వేసుకుని తిరుగుతూ డబ్బు సంపాదిస్తూ వుంటే నాకు కూడా ప్లీడరీ చెయ్యాలనే సంకల్పం కలిగింది. ఆ లాంగుకోటుమీద ప్రేమ చాలా వరకూ వెళ్ళింది. మిడిల్ స్కూల్లో చదువుతూ వుండగానే ఒక లాంగు కోటు కుట్టించాను.

* * *

[ప్రకాశంగారు తరవాత పెద్దచదువులు చదివి ఇంగ్లాండు వెళ్ళి బారిష్టరు ప్యాసయి, మద్రాసులో గొప్ప ప్లీడరని పేరుపొంది, తరవాత కాంగ్రెసులో చేరి, గొప్ప త్యాగంచేసి, జైలుకెళ్ళి, ఇప్పుడు మన చెన్నరాజధానికి ప్రధానమంత్రి అయారు. వీరి జీవితచరిత్ర అందరూ చదవవలసిందే. పుస్తకాలు కావాలంటే మేనేజరు : శిల్పి, 10, నరసింగపురం వీధి, మౌంటురోడ్డు, మద్రాసు. అని రాయండి. వెల మూడు రూపాయలు]

# బీటాలాక్సు

## సుఖవిరేచనౌషధము




ఇది చాక్లెట్ భేదిమాత్రలు, సుఖవిరేచనము కలిగించి మలబద్ధమును పోగొట్టి మంచి జీర్ణశక్తి నిచ్చును.

పొట్లం 2 బిళ్లలు

**1 అణా.**

తయారుచేయువారు :

B. T. M. Co., Post Box 2092, Bombay 2.



# రీటా తలవెంట్రుకలను పెంచును



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెంట్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును. సీసా 15అ.




**RITA**

**HAIR TONIC**



# ప్రార్థన

వెనకా వెనకా
వేముల తోట
కనకా పండ్లు
కామని రూపులు
మేఘా శంఖులు
మెత్తని గోళ్లు
దూదీ మణుగులు
దుప్పటి రేకులు
వాగూనీళ్లు
వనముల పత్రి
తెల్లని గుళ్లో
నల్లని వినాయకుడికి
నాలుగు చేతులవాడికి
నమస్కారము.

సంపాదన :

తూటుపల్లి బాలవెంకటసుబ్బు.


## పిల్లలూ!

మంచి బాగా చేవ్రాత రాస్తే మంచి మార్కులు పరీక్షలో వస్తాయి. జాబ్‌కో ఫౌంట్ ఇంక్ తో రాస్తే ముత్యాల్లాంటి అక్షరాలు వస్తాయి. మీరు హిందూదేశములోని మంచి సిరానే వాడుచున్నారనుకుంటాను. స్వదేశీ సిరా వాడడమే మంచి అలవాటు.



### జాబ్‌కో ఫౌంట్ ఇంక్

ఇండియాలో మంచిది.

★

జయభారతం కంపెనీ

మదరాసు - బెంగుళూరు - ఎర్ణాకులం.



# గణపతి -

(పాట)

ఆకాశములో - ఆకాశములో
లెక్కకు మించిన చుక్కలురా
లెక్కకు మించిన చుక్కలనడుమ
చక్కనిచందురు డొక్కడెరా ॥

చక్కనిచందురు బింబముపైన
చెవులపిల్లి ఒక టున్నదిరా
మాసముదినముల కొక్కపక్షమున
చెవులపిల్లి మన కగపడురా ॥

గణపతిదేవుని కోపమువలన
చంద్రునికట్టి శాపమురా
శాపమువల్లను చందురుడెప్పుడు
పెరుగుచు తరుగుచు నుండునురా ॥

# చందమామ



ఈ ప్రక్క పేజీలోని పాట ఆనందు పాడుతూ వుంటాడు.

శ్యామల ఆ పాట విని :—

శ్యామల :- తమ్ముడూ! ఆనందూ! ఆపాట చాలా బాగుంది కాని ఆపాట అర్థము నీకు తెలుసా?

ఆనందు :- తెలియదు శ్యామలా.

శ్యామల :- గణపతి దేముడు అంటే తెలుసుగా?

ఆనందు :- ఓ! బొజ్జల గణపయ్య ఎవరికి తెలియదు?

శ్యామల :- బొజ్జల గణపయ్య అని ఎగతాళి చేయకూడదు. చందమామ పూర్వం అలాగ ఎగతాళి చేయబట్టే శాపం పొందాడు.

ఆనందు :- ఏమిటీ! శాపమా?

శ్యామల :- అవును. ఆ కథ చెప్తా విను... మొన్న భాద్రపద శుద్ధ చవితినాడు మనమందరము వినాయకుని పూజచేశాము జ్ఞాపకము వుందా?

ఆనందు :- ఓ! ఆ రోజున మన అమ్మ ఉండ్రాళ్లు, కుడుములు, బూరెలు వండిపెట్టిందిగా.

శ్యామల :- ఆ వినాయకుడ్నే గణపతి, విఘ్నేశ్వరుడు అని అంటారు. మనం చేసేపనులు విఘ్నంకాకుండా, అంటే, చెడిపోకుండా, బాగా జరగాలని విఘ్నేశ్వరుడ్ని అందరూ పూజచేస్తారు.

ఆనందు :- అయితే కథ చెప్తానని అన్నావు కథ ఏమిటి?

శ్యామల :- ఇదుగో చెప్తున్నానుగా!...పూర్వం విఘ్నేశ్వర చవితినాడు అందరూ విఘ్నేశ్వరుడ్ని పూజచేసి, కుడుములు, ఉండ్రాళ్లూ, చెరుకుముక్కలూ వడపప్పూ అవీ వినాయకుడికి నైవేద్యం పెట్టారు. వినాయకుడు అవన్నీ బొజ్జనిండా బాగామెక్కి, పెద్దగుమ్మిడికాయంత కడుపుతో నడవలేక, నడవలేక, సంతోషముతో గంతులువేశాడు. ఆ బొజ్జగణపతి తొండం, చెవులూ, పొట్టా చూచి ఆకాశంమీద చందమామ ఫక్కున నవ్వేడు.

ఆనందు :- అవును మరీ! నవ్వురాదూ!...విఘ్నేశ్వరుడికి కోపం వచ్చిందా?

శ్యామల :- విఘ్నేశ్వరుడికి ఏడుపు, కోపంవచ్చి వాళ్లమ్మ పార్వతితో చెప్పాడు. ఓహో! చంద్రుడుకి అంత గర్వంగా వుందా అని పార్వతి శాపంపెట్టింది.

ఆనందు :- ఏవని?

శ్యామల :- ఈ గర్వపోతు చంద్రుణ్ణి ఎవరైతే యీ చవితినాడు చూస్తారో వారికి నీలాపనిందలు వచ్చుగాక! అని శాపం పెట్టింది.

ఆనందు :- నీలాపనింద అంటే ఏమిటి శ్యామలా!

శ్యామల :- నీలాపనింద అంటే, మనం ఏమీ తప్పు చేయకపోయినా, చేసినట్టు మాట రావడం...అంతేకాదు ఇంకో శాపం కూడా పెట్టిందంటారు. అదేమిటంటే "చంద్రుడు రోజురోజూ క్షీణించిపోవు గాక!" అని.

ఆనందు :- క్షీణించడం అంటే ఏవిటి?

శ్యామల :- అంటే తగ్గిపోవడం. చంద్రుడు రోజుకి రోజూ చిన్న వాడైపోవాలని శాపం. పార్వతి ఇలాగ శాపం పెట్టగానే చంద్రుడికి భయంవేసి పార్వతిని క్షమించమని వేడుకున్నాడు. అప్పుడు పార్వతికి మళ్లీ జాలివేసి ఒకవరం ఇచ్చింది.

ఆనందు :- ఏమని?

శ్యామల :- నెలలో 15 రోజులు చంద్రుడు క్షీణించునట్లు, మరి పదిహేనురోజులు పెరుగునట్లు వరమిచ్చింది.

ఆనందు :- ఓహో! ఇప్పుడు తెలిసింది. అందుకనే మనకి చీకటి రాత్తుళ్లు వెన్నెల రాత్తుళ్లు వస్తాయి. ఔనా?

శ్యామల :- అవును. బాగుందికదూ యీ కథ.


ఆనందు :- ఇది నిజంగా జరిగిందీ శ్యామలా?

శ్యామల - అదేమో! అందరూ యీకథ పూర్వంనుంచీ చెప్పుకుంటారు. నిజమేగాబోలు!

రచన: బొలిశెట్టి నారాయణమూర్తి గుప్త

టీచరు (ధూళిపూడి)






మన దేశములో పుట్టి పెరిగి, మన దేశానికి కీర్తిగడించిన బాలవీరులు చాలామంది ఉన్నారు.

వారినిగురించి ముందుగా మనము తెలిసికోవాలి. తర్వాత ఇతర దేశాలలో పుట్టిపెరిగిన బాల వీరులను గురించికూడా మనము తెలిసికోవాలి.

మన దేశములోని బాల వీరులలో అవతారపురుషులున్నారు, చక్రవర్తులున్నారు. కవులున్నారు. పరాక్రమశాలు లున్నారు. దేశోద్ధారకులున్నారు.

వారినిగురించి బాలు లందరూ తెలిసికొని, వారి అడుగుజాడల్లో వెళ్ళినట్లయితే వృద్ధిలోకివస్తారు.

ఆదికాలంనుంచీ మన బాల బాలికలను సన్మార్గవర్తులనుగా ప్రేరేపించిన గ్రంథాలు, రామాయణమూ, భారతమూ మొదలైనవి. అట్టి గ్రంథములమీద మనకు గౌరవముండాలి.

ప్రాచీనకాలమున మన బాల వీరులను ప్రోత్సాహపరచిన గ్రంథములు మనలనూ ప్రోత్సాహపరుస్తాయి. మనమూ వారివలెనే దేశసేవ, భాషాసేవ చేయగలము.

మంచివారితో సహవాసము చేస్తే మనకు మంచి వస్తుంది. బాలవీరులతో సహవాసము మనకు అనేకవిధాల లాభకరము.

ఆటలు ఆడుతూ పాటలుపాడుకుంటూన్న కాలంలోనే శ్రీకృష్ణుడెన్నో గొప్పపనులు చేశాడు.

చదువు కుంటూన్న కాలం లోనే శ్రీరాముడు రాక్షసులను సంహరించాడు.

పాలబుగ్గలవయస్సులోనే కుశ లవులు యుద్ధం చేశారు.

బాల్యంలోనే మహాభక్తు డయ్యాడు ప్రహ్లాదుడు.

బాల్యంలోనే ధ్యానముచేసి దేవుణ్ణి ప్రత్యక్షం చేసుకొన్నాడు ధ్రువుడు.

బడిలో చదువుకొనే కాలం లోనే సిరియాళుడు తల్లిదండ్రుల ఆజ్ఞ శిరసావహించి దేహత్యా గంచేశాడు.

రామాయణ భారతాది కథ లువిని బాల్యంలోనె హిందూ సామ్రాజ్యానికి పునాది వేశాడు శివాజీ.

ఇంకా ఎందరో ఎందరో బాల వీరులు మన దేశంలో వెలశారు.

వారినిగురించి క్రమ క్రమంగా మనం నేర్చుకోవాలి. అవునా?

# 3 ఊహలు

పక్షిని చూస్తే
పక్షి రూపమున
ప్రపంచమంతా
పరుగిడుదామని

ఒక ఊహ!

చేపను చూస్తే
చేప రూపమున
చెంగున నీటిలో
చరించుదామని

ఒక ఊహ!!

ముద్దులు గులుకుచు
సుద్దులు పలికే
బాలల చూస్తే
బాలౌదామని

ఒక ఊహ!!!

: రచన :

మునుకుట్ల శకుంతల

(కాకినాడ)

# వర్షకాలపు పాటలు

కప్ప తల్లి నీళ్లాడె
కడవలనిండ నీళ్లొచ్చె
కనవోయ్ - వానదేవుడా

ఈగతల్లి నీళ్లాడె
వీధులనిండ నీళ్లొచ్చె
వినవోయ్ _ వానదేవుడా

దోమ తల్లి నీళ్లాడె
దొరువులనిండా నీళ్లొచ్చె
కనవోయ్ - వానదేవుడా

బాతు తల్లి నీళ్లాడె
బావులనిండ నీళ్లొచ్చె
వినవోయ్ - వానదేవుడా

చేప తల్లి నీళ్లాడె
చెరువులనిండ నీళ్లొచ్చె
కనవోయ్ - వానదేవుడా?

సంపాదన: కర్రా రామకృష్ణారావు.

# ముద్దు బిళ్లలు

మానాన్న ఒచ్చారు

బిళ్లలు తెచ్చారు

బిళ్ల ఇమ్మన్నాను

ముద్దెట్ట మన్నారు

ముద్దెట్ట నన్నాను

బిళ్లివ్వ నన్నారు!

ముద్దెట్టుకున్నాను

బిళ్ల ఇచ్చారు!

రచన : శ్రీపాదన్న గిరిజకుమారి
(బొండాడ)



# ముగ్గురు కలిసి వెళ్తే...?

రచన: గుం. కళావతి (మద్రాసు)

ఆదివారం వచ్చింది. "బీచికి పోదాం" అన్నాడు మా మామ. బయలుదేరి గడప దిగి దిగకముందే మామకొక స్నేహితుడు కనబడ్డాడు. "ఏమోయ్, సినీమాకు వెళదామా!" అన్నాడు. "సరే పద" అన్నాడు మా మామ. "ముందు కాఫీ కావాలి" అన్నాడు ఫ్రెండు. కాఫీ హొటల్ దగ్గరలోనే ఉంది. అక్కడికి వెళ్లేసరికి నాకు ఒక క్రొత్తవింత కనిపించింది. హోటేలులో ఎక్కడా కాఫీలేదు. అందరు తింటున్నారుగాని ప్రతి కుర్చీ వెనుక ఒకడు నిలుబడియున్నాడు. "ఇదేమిటి" అన్నాను ఆశ్చర్యబోయి. "హోటేల్" అన్నాడు ఆ స్నేహితుడు. "ఇలా ఎందుకు నిలబడ్డారు?" అని అడిగాను. "కూర్చున్నవారు లేవగానే ఆకుర్చీలో వారు కూర్చోడానికి ప్రక్కననే నిల్చున్నారు" అని మా మామ చెప్పాడు. మేమూ నిలబడ్డాముగాని చోటు చిక్కలేదు. ఆఖరుకి సినీమాకు వేళవుతోందని అక్కడనుండి వెళ్ళిపోయాం. మా మామ "డాక్టర్ కొట్నీస్ బాగుంటుం"దన్నాడు. సరే అని బస్టేండుకు వెళ్ళాము. ఇరువై నిమిషాలు ఐంది. ఐదు బస్సులు వచ్చిపోయాయి. గాని మాకు చోటు చిక్కలేదు. ఆఖరికి ట్రాంలో యెక్కిపోయాం. తియేటరుదగ్గర అందరు ఒక వరుసగా నిలబడియున్నారు. "ఇదేమిటి" అని మామను అడిగాను.

"క్యూ" అన్నాడు గాని ఆ 'క్యూ' ఏమిటో నాకు బోధపడ లేదు. ఆ ఫ్రెండుకూడ వరుసలో నిల్చాడు. కొంతసేపటికి 9 అణాల టిక్కెట్లు ఐ పోయినవి. ముప్పావులా టిక్కెట్టు కౌంటరుకి అందరు పరుగెత్తారు. మఱికొంతసేపటికి అవికూడ ఐపోయినవి. 'సరే ఇక రిట్రీట్' అన్నాడు ఫ్రెండు. అతడు మరెక్కడికో పోయాడు. మేము ఇంటికి వచ్చాం. ఇంట్లో అమ్మమ్మ 'ఎక్కడికెళ్ళావే' అని అడిగింది. అంతా చెప్పాను. 'మరి చూసావా, ముగ్గురుచేరి బయలుదేరితే ఎప్పుడు ఇల్లా పని మోసంఅవుతుంది' అంది మా అమ్మమ్మ. నిజమేమో అనిపించింది నాకు.

## మేము నలుగురము!




పంపినవారు: యం. నాగరత్నం, (ధూళిపూడి)

# అ-ప్ర-శి-ఖి

కె. అహల్యాబాయ్ (ఖమ్మంమెట్టు)

అనగా అనగా ఒకఊరిలో ఒక రాజు ఉండేవాడు. ఆ రాజు కొడుక్కీ మంత్రికొడుక్కీ చాలా స్నేహం. వారిద్దరు అడవిలో ఒకయోగివద్ద విద్య నేర్చుకొనే వారు. రాజుకొడుకు చాలా తెలివి కలవాడు.

కొన్నిఏళ్లయినతరువాత వారి విద్య పూర్తి అయింది. వాళ్లిద్దరు గురువుకి నమస్కారముచేసి అడవిలోనుంచి ఇంటికి వస్తున్నారు. దారిలో రాజుకొడుకు మంత్రికొడుకుతో నిద్రవస్తున్నదన్నాడు. మంత్రికొడుకు తనఒళ్లో తలపెట్టుకొని పడుకోమన్నాడు. రాజుకొడుకు నిద్రపోయిన తరువాత మంత్రికొడుకు ఇలా అనుకున్నాడు. ఇంటికివెళ్తే రాజు విద్య పరీక్షచేస్తాడు. వీడు అన్నీ బాగా చెప్తాడు. నాకేమీ రాదుగదా చెప్పటానికి. వీడిని ఇక్కడే చంపి పులి తిన్నదని చెప్తాను. అని అనుకుని రాజుకొడుకు తలపట్టుకుని కత్తితీశాడు. అంతలోకే రాజుకొడుకు లేచాడు. తనను చంపబోతున్న మంత్రికొడుకుతో ఇలా అన్నాడు. నేనొక కాగితం రాసి ఇస్తాను. ఇది మా నాన్నకు ఇయ్యమని ఒక కాగితంమీద అ ప్ర శి ఖ అని రాసిఇచ్చాడు. మంత్రికొడుకు అది తీసుకుని రాజుకొడుకుని నరికేశాడు.

ఇంటికివచ్చి నీకొడుకుని పులి చంపింది. చచ్చేముందర నీకియ్యమని ఇది ఇచ్చాడు అనిచెప్పి ఆ కాగితం రాజుకు ఇచ్చాడు. రాజు కొడుకుకోసంఏడ్చి పండితులను పిలపించి దానికి అర్థం అడిగాడు. వాళ్లెవరికీ తెలియలేదు.

ఆరోజుసాయంత్రం అ అంటే


అడవిలో ప్ర అంటే ప్రధాని కొడుకు శి అంటే శిఖ పట్టుకొని ఖ అంటే ఖండించెను అని పక్షులు చెప్పుకుంటుంటే పక్షి భాషవచ్చిన ఒక చాకలివాడు విన్నాడు. పోయి రాజుగారితో చెప్పాడు. రాజుకు మంత్రికొడుకు మీాద కోపంవచ్చి వాడిని ఉరి తీయించాడు.

కథ కంచికి, మనం ఇంటికి.

# అ ణా ల య ం త్ర ం!

ఈ చక్రం బొమ్మ చూశారా?

ఈ చక్రం త్రిప్పితే మీకు కావలసినన్ని అణాలు వస్తాయి. ఎలాగంటే—



పుస్తకాన్ని రెండుచేతులతో అడ్డముగా పట్టుకొని, గ్రామఫోను రికార్డు తిరిగినట్లు, పుస్తకాన్ని గిరగిరా త్రిప్పండి. అలాగ త్రిప్పుతూ ఆ చక్రంలో చూచారంటే అందులో అణాలు కనబడతాయి!

సంపాదన: "గోష్పి"



# రత్నగుమ్మాడి

రచన: కాశీసోమయాజుల పద్మావతి

"బుచ్చిమామయ్యా! ఒకకథ చెప్పవూ!" అని అడిగాను.

"మెరుమెయిడు కథ చెప్పేదా"—అని అడిగాడు.

"మెరుమెయిడంటే ఏమిటి" అని అడిగాను.

"నడుం పైభాగం మనిషి రూపు, క్రిందభాగం చేపరూపు కలిగి, నీటిలో వుంటారు. వాళ్లే మెరుమెయిడులు. తెలుగులో జలకన్యలని అంటారు"—అన్నాడు.

సరే—కథచెప్పు అన్నాను...

అనగా అనగా ఒక పెద్ద సముద్రంవుండేది. మరి సముద్రం అంటే ఇంతా అంతా లోతుంటుందా? చాలా లోతుగా వుంటుంది. సముద్రం క్రింద మన భూమ్మీదలాగే చెట్లు అవీకూడ ఉంటాయి. అనేక రకాల జంతువులూ వుంటాయి! మా నాన్న నాకు పుస్తకాల్లో చూపించేరు. చాలా బావున్నాయి.

అదుగో అలాంటి సముద్రం క్రిందని, ఒక వూళ్లో ఒక రాజుండేవాడు. ఆ రాజుగారి కోటలో, సముద్రంలో దొరికే మంచి ముత్యాలు, రకరకాల రత్నాలు అవీ ఎన్నో వుండేవి. ఆ రాజుకి ఆరుగురు కూతుళ్లు, పాపం వాళ్లకి తల్లిలేదు. వాళ్లని వాళ్ల ముసలమ్మ పెంచుతూ వుండేది. ఆ ఆరుగురు కూతుళ్ల లోను ఆఖరిపిల్ల చాలా బాగుండేది. చల్లగా పాడేది. చక్కగా నాట్యంచేసేది. ఆ పిల్ల పేరు రత్నగుమ్మాడి.

రత్నగుమ్మాడి ఎప్పుడూ వాళ్ల మామ్మని మన భూమిమీద వుండే వింతలు, విశేషాలు చెప్పమనేది. "నాకోసారి అదిచూపిం

చవూ'' అని అడుగుతో వుండేది. అంతే వాళ్ళమామ్మ ''నీకు పది హేనేళ్లువస్తే వెళ్ళి చూద్దుగాని'' అనేది.

ఆ ఏడు పెద్దపిల్లకి పదిహే నేళ్లు వచ్చేయి. అప్పుడు వాళ్ళ మామ్మ పెద్దపిల్లకు నీళ్ళుపోసి మంచి మంచి ముత్యాలహారాలు మెళ్లోవేసి బాగా ముస్తాబుచేసి ఇంకవెళ్లి ఒక రోజుల్లా పైప్రపం చాన్ని చూసిరా అని పంపింది.

వెంటనే పెద్దపిల్ల రంయిమని పైకి ఈదివచ్చి ఒక్కమారు కళ్లు విప్పింది. అప్పుడు గుళ్లు, గోపు రాలు, మేడలు, మిద్దెలు అన్నీ ఎన్నో ఆపిల్లచూసింది. అవన్నీ ఆ పిల్లకి ఎంతో అందంగా కన్పించేయి. సంతోషం పట్టలేక పోయింది. అలా రోజల్లా కూర్చుని సాయంత్రం దీపాల వేళకు మళ్ళీ క్రిందకొచ్చి తను చూసింది అంతా తన చెల్లెళ్లకు చెప్పింది. రత్నగుమ్మాడి మట్టుకు ఎంతో శ్రద్ధగావింది. ఎప్పుడునే వెళ్లిచూస్తానా అని అస్తమానం ఆలోచిస్తో వుండేది.

మళ్లీఏడొచ్చింది. రెండోపిల్ల వచ్చింది. మూడోఏడు మూడో పిల్ల వొంతొచ్చింది. అలాగే ఒక్కొక్క కూతురువొస్తూచూస్తూ, సంతోషిస్తో వుండేవారు.

ఆ ఏడు, రత్న గుమ్మాడి వంతువచ్చింది. ఇక చూసుకోండి ఆమె సంతోషం ఎంతని చెప్పను! చీకటితోనే లేచి నీళ్లు పోసేసు కొని కొత్తబట్టలు తొడుక్కొని వాళ్ళమామ్మ నడిగి జంయిమని పైకి ఈదివచ్చి బీచివొడ్డున కూర్చుని అలా ఆ పట్టణాన్ని తెగచూస్తూ వుండి చెడ్డసరదా పడిపోతో వుండేది.

సాయంకాలం అయింది. ఆ వూరిరాజు బీచికి షికారొచ్చేడు. అతన్ని చూసింది. చాలా అందం గా వున్నాడు. అంత అందమైన వాణ్ణి ఎప్పుడూ తను చూడలేదు. ''ఇతణ్ణి ఎలాగైనా పెళ్లాడాలి.'' అనుకొంది. నీటిలోకి మునిగి సముద్రదేవత దగ్గరికివెళ్ళి నాకు ఈ చేపతోకపోయి మనిషికాళ్లు కావాలి. నువ్వు నాకు ఇస్తే నీకే మిటి కావాలంటే అదిస్తాను. నాకు

మనిషి కాళ్ళొచ్చే మందు ఇయ్యి అని అడిగింది. అంటే ఆ దేవత నీ నాలుక కోసి ఇచ్చి అంది. అవుతే ఇంద అని నాలుకకోసి ఇచ్చి మండకుండా మందుపుచ్చు కొని దేవతఇచ్చిన పసరుపట్టు కొని పైకొచ్చి పట్టించుకొంది. వెంటనే రెండు కాళ్లొచ్చాయి. అప్పుడు రాజుగారి దగ్గరికి వెళ్ళింది. రాజు రత్నగుమ్మాడిని చూసి ఆ అందానికి ఆశ్చర్యపోయి నన్ను పెళ్లాడుతావా అన్నాడు. "ఊఁ" అంది, వెంటనే రాజు రత్నగుమ్మాడిని పెళ్ళాడేడు. నోరు లేకపోయినా ఎవరైనా పాడితే బాగా నాట్యంచేసేది. రాజు ఇలా పాడేవాడు.

దూడలకే పాటలు వస్తే
గుమ్మాడికి మాటలు వస్తే
సూర్యుణ్ణీ టాకీతీస్తాం
చంద్రుడుకీ టీకావేస్తాం.

అప్పుడు గుమ్మాడి నాట్యం చేసేది. రాజు ఎంతో సంతోషంగా గుమ్మాడితో కాలం గడిపేవాడు.

[ఈ కథ ఇంగ్లీషు పుస్తకంలో చదివి మా మామయ్య చెప్పాడు.]

# కర్రలతో ★ ★ నీతులు

తడ కర్ర!

తుమ్మ కర్ర!

మునగ కర్ర!

వేప కర్ర!

బాల


ఈ కర్రలతో

నీతులుగరపును

అల్లరచేయు

కర్రా!

రచన: పి. వి. ఈశ్వరదాస్
(ఖర్గపురము)



# నేను పస్తు నువ్వు మస్తు!

ఆహా - ఇదేనా న్యాయం ?

పైరు వేసినది రైతు
పంట తిన్నది బుగత

రైతు కడుపులో మంట
బుగత గాదెలో పంట
కృషించేది కూలిజనం
సుఖించేది ధనికవర్గం
కూలీలకు కూడేలేదు
ధనికులకు జీర్ణమెకాదు
రైతు చేతిలో పంట
రైతు కడుపులో మంట!
చేసింది నేను
తిన్నది నీవు!
నేను పస్తు
నువ్వు మస్తు!
ఆహా! ఇదేనా ధర్మం!

రచన: బి. శ్రీరామమూర్తి (ధర్మవరం)


# నక్క - నారదుడు

రచన: వి. సూర్యనారాయణరావు

అనగా, అనగా, ఒక అడవిలో ఒక నక్క వుంది. ఒకరోజున ఆ నక్కకు ఆహారము ఏమి దొరకలేదు. అందుకని ఆ అడవి అంత, పాపం, అలా, అలా తిరుగుతూ వుంది. తిరగ్గా, తిరగ్గా, ఒక చోట చచ్చిపడివున్న ఒక



ఏనుగును ఆ నక్క చూచింది. చూచి చాలా సంతోషపడింది. 'కొంతకాలముదాక నేను తిండి కని తిరగనక్కర లేదని' సంతోష పడింది. ఆ తరువాత మెల్ల మెల్లగా ఆ ఏనుగువద్దకు వెళ్ళి, దాని పొట్టదగ్గర బెజ్జముచేసింది. ఆ బెజ్జముగుండా అది ఏనుగు లోపలికి వెళ్ళింది. వెళ్ళి, లోపలి



మాంసము తింటూ, ఆ లోపలే వుంటూవుంది. అప్పుడు అది వానాకాలము. అంచేత ఏనుగు చర్మము మెత్తగా వుండెను. అలా మెత్తగా వుండటంచేత, ఆ నక్క, లోపలికి, బయటికి తిరుగుటకు వీలుగా వుండెను.

ఈలా కొన్నిరోజులు అయిన తరువాత ఎండాకాలము వచ్చింది. వానలకు తడిసి, నాని, మెత్తగావున్న ఆ ఏనుగు చర్మము కాస్తఎండి, బిగుసుకొని పోయింది. నక్కచేసిన బెజ్జము మూసుకొని పోయినది. అందుకని పాపమా నక్క బయటికి రాలేక లోపలనే వుండిపోయింది. ఈలా కొన్ని రోజులు నక్క లోపల

బాధపడుతు వున్నది. ఒక రోజున ఆ దారివెంట నారదుడు వెళ్తూవుండెను. మనిషి నడక చప్పుడువిని. లోపల వున్న ఆ నక్క 'ఆ వెళ్లేవా రెవరయ్యా' అని అడిగింది. అప్పుడు నారదుడు వులిక్కిపడి, వెనక్కు తిరిగి చూచాడు కాని - ఎవరు కనుపించలేదు.

నక్క:- 'ఈ ఏనుగులోపల తపస్సు చేయుచున్నాను. యిటు రావయ్యా!'

ఏనుగు కడుపులోనుండి వచ్చిన ఆ మాటలు నారదుడు విని అతను ఎవరో గొప్ప మునీశ్వరుడనుకొని, దగ్గరగావచ్చి, దండం పెట్టాడు.

నక్క:- నీ పేరేమి?

నార:- నేను నారదుడను. తమరు ఎవరు స్వామీ?

నక్క:- నా పేరు గంభీర మహా ఋషి. నీవు నిజముగా నారదుడవేనా?

నార:- నేను నిజముగా నారదుడనే స్వామీ?



నక్క:- నీవు నిజముగా నారదుడవు అయినచో విష్ణుని, శివుని, బ్రహ్మని, ఇటకు పిల్చుకొని రమ్ము. అప్పుడే నీమాట నమ్మెదను.

నక్క అలా అనగానే నారదుడు త్వరగా కైలాసానికి వెళ్లాడు. శివునితో చెప్పాడు. అక్కడి నుంచి, బ్రహ్మ, విష్ణువద్దకు వచ్చాడు.

'స్వామీ! నేను పుట్టి ఇన్ని సంవత్సరము లైనదిగాని, యీలాంటి ఋషిని ఎక్కడ చూడలేదు' అని జరిగిన సంగతంతా చెప్పాడు. అప్పుడు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు, నారదుడు, అందరూ కలసి, ఆ ఏనుగు దగ్గరికివచ్చి, వినయంగా, ఇలా అన్నారు:

'ఓ! మునీశ్వరా! నమస్కారము.'

నక్క:- నారదా! విష్ణు, బ్రహ్మ, శివుడు, వచ్చినారా?

నార:- 'వచ్చినారు స్వామి.'

నక్క:- మీరు, నిజముగా త్రిమూర్తులైతే, ఒక వర్షము కురిపించండి! అప్పుడు, మీరు నిజముగ త్రిమూర్తులని నమ్మగలుగుతాను. నమ్మటమే కాదు మీకు నా దర్శనము కూడా యిస్తాను!'

అప్పుడు ఆ త్రిమూర్తులు మాంచి, పెద్దవాన కురిపించారు. ఆ వానకి ఏనుగు చర్మము, తిరిగి మెత్తపడింది. ఏనుగు చర్మము మెత్తగ అవగానే, మన నక్కగారు తోక ముడుచుకొని, మెల్లగా బయటికివచ్చి తుఱ్ఱుమని పారి పోయారు!

ఇదంతా చూస్తున్న ఆబ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఏమి చేయాలో తెలియక నిర్ఘాంత పోయి ఒకరి ముఖము ఒకరు చూచుకున్నారు.


# కావాలోయ్ కావాలి

వేసవికాలం
వెన్నెల డాబా
వర్షా కాలం
వెచ్చని దుప్పటి
శీతా కాలం
చితుకుల మంట
కావాలోయ్ కావాలి

★

మా అన్నయ్యకి
మంచీ వదినా
మా చెల్లాయికి
రబ్బరు బావా
మరి నాకో?
ఒక బొమ్మల బాల
కావాలోయ్ కావాలి!


రచన: డి. తిమ్మేశ్వరరావు (తణుకు)



# అమ్మాయీ - ఆవూ

రచన: వెల్దుర్తి మాణిక్యారావు (నల్గొండ)

చిన్న మా అమ్మాయి పాలకేడ్చిందీ
తెండోయి గంగావు మేన మామల్లు
పాలు పితుకుటకొరకు బంగారుముంత
వెండి తీగలతట్ట పిండి పెట్టుటకూ
పట్టుపగ్గము నేడె పేను కొనిరండూ
మామ పితికిన పాలు అమ్మాయితాగు;
విడిచిపెట్టినచేరు చిరులేగ జీకు
కాలి అందెలు మ్రోగ అమ్మాయి ఆడు
గంట గల్లున మ్రోగ చిరులేగ దుముకు
అమ్మాయి ఆటలకు తల్లి ముద్దాడు
ఆడు లేగను జీరి ఆవు మెయినాకు
ఆనంద బాష్పాల ఆకసము ఝల్లు
భూతల్లి పచ్చికను ఆవుకందించు.




# మోహన చంద్రుడు

రచన:
శిష్ట్లా ఉమామహేశ్వరరావ్

కర్పూర దేశ రాజకుమారి పేరు ఇందిర. ఈమె చాలా అందమైన బాల. పసితనంలోనే ఆ బాల ముసి నవ్వులు ముత్యాల జిలుగు లల్లే కనుబడేవి. అందువల్ల ఆ బాలను తలిదండ్రులే గాక ఆ బాలగోపాలమందరూ అల్లారు ముద్దుగా చూచేవారు.

ఈడు వచ్చిన ఇందిర యిష్టమొచ్చినరీతి గడుసుతనంగావున్ననూ ఎవరేమి అనే వారు కారు. పెండ్లియీడువచ్చిన తర్వాతగూడ ఇందిరకు పడుచుతనపు ఆర్తత్వం కలగలేదు. 'నాయిష్టం' 'నీకెందుకూ' 'నువ్వెవరు చెప్పేది' 'నామాట కడ్డురాకు' అనే మాట లామెకు సహజమై పోయాయి.

'అమ్మాయిని ఎవరైనా పెండ్లి చేసుకుంటారా?' అని విచార సూచకంగా అడిగాడు మహా రాజు.

'ఇంత గడుసుతనమూ మీరే గా నేర్పింది' అని యీసడించింది మహారాణి.

'నేనా! నీకేం మతిపోయిందా? ఆడపిల్లను పెంచేది తల్లిగాని తండ్రియా!'

'పెంచేది తల్లే - పెంచనిస్తేనా! ఏమీ అననీయక పోయిరి. ఇంక దానికి భయమెట్లా కలుగుతుంది?'

'ఏమీ అననీయక పోయిన వాడ్ని నేనా? అసలు నువ్వెప్పుడైనా ఏమైనా అంటానికి ప్రయత్నించావా ?

'ఊరుకోండి మీరు. గడిగడికీ ఎందుకీ పోట్లాట ?'

అంతటితో మహారాజుకూ మహా రాణికి సంభాషణ ఆగేది. ఇందిరకు పెండ్లిమాట లాగేవి.

ఇట్లా గడిచాయి; సంవత్సరాలు ముడుచుకుని పోయాయి. ఇందిరకు పెండ్లి కాలేదు. చుట్టాలకు పక్కాలకూ గూడా చిందర వందర మనస్సులై పోయాయి.

ఇట్లుంటుండగా దైవ వశాత్తూ కర్పూర రాజ్యంలో పదేండ్ల కొకసారి జరిగే ధనుర్విద్యా వేడుకలదినం వచ్చింది. వివిధ దేశాల రాజ కుమారు లొస్తారు గదా అందులో ఇందిర గడుసుతనం తెలియని రాజకుమారుడుండడా! అందంలో మించినదిగదా! ఎవరో ఒకరు వరించరా యని తలిదండ్రులు సంతోషించారు.

సాయంత్రం నాలుగు గంటల కారంభమై రాత్రి పది పదునొక్క గంటదాకా వేడుకలు జరుగుతాయి. అలంకారం చేసుకుని ఆభరణాలు ధరించి అందరిమధ్యా అందరాని కొమ్మల్లే రావమ్మా అని తలిదండ్రులు ఇందిరను అడిగారు.

'నేనురాను. మీరురమ్మంటే వస్తానా! నాయిష్టం. నాగదిలో కూర్చుని నే నెవరు పిలిచినా రాను. మీరుపోండి. నన్ను పెండ్లాడేవాడీ ప్రపంచంలో లేడు. మీ ఆలోచన నాకు తెలుసులే. పోండి!' అన్నది ఇందిర.

నీళ్లు నములుకుంటూ గోళ్ళు గిల్లుకుంటూ మహారాజున్నూ, ముక్కు గీక్కుంటూ పమిట తముడుకుంటూ మహారాణీ తల లువంచుకుని మాటాడలేక ఏం చేయలేక విచారంగా అట్లాగే వెళ్ళిపోయారు.

కూర్చుంది కూర్చుంది తన గదిలో ఇందిర. కొంతసేపటికి మెత్తని పరుపుమీద పడుకుంది. రాత్రి ఎనిమిదయే సరికి ఇందిరకు విసుగు వేసింది. మరికొంతసేపటికి ఇందిరకు ఏమీ తోచక విసుగుతో వాళ్ళు దురదలెత్తింది.

'నే చేసింది పొరబాటే. అమ్మా నాయనతో ఆ వేడుకల దగ్గరకు పోవాల్సింది!' అనుకుంది.

'ఇప్పుడేముంది, ఊఁ ఆ చంద్రుడ్ని చూస్తూంటాను' అనుకొని కిటికీ దగ్గిర నుంచుని చంద్రుణ్ణి చూస్తూ చూస్తూ 'చంద్రుడా! నాకు పొద్దుపోవడానికో పాట పాడుమా! నువ్వేదడిగితే అది యిస్తా. తప్పకిస్తా, నన్ను గడుసంటారే గాని నేను మాట తప్పేదాన్ని కాదు. పాడుమా! ఒక్కపాట పాడుమా!' అని బ్రతిమాలింది.

అదేమిటో ఎక్కడ్నుంచో మధురంగా మహత్త్వంగా మోహన సంగీతస్వరం వినవచ్చింది. ఆ సంగీత స్వరాన్ని యాలించియంతతో తన్మయురాలై ఇందిర కిటికీలోంచి మెల్లిగా అటుఇటూ చూచి ఆశ్చర్యపోయింది.

ఆ సంగీతం పూవనంలోంచి వస్తున్నదేమో అని ఎంచి మేడ దిగి ఆదిశ పోయింది.

ఇందిర ధరించిన తెల్లదుకూలముపై వెన్నెల వెల్లి విరిసింది. ఆ వెన్నెల ఆమె మోముపై బారి ఆమె నొక వెన్నెల ప్రతిమ మాదిరి చేసింది. ఆవెన్నెల చల్లదనానికి ఆ సంగీత సరసత్వానికీ ఊరుకోలేక ఇందిర నాట్యమాడ నారంభించింది.

ఆడుతూ ఆడుతూ ఆగింది. అలసటచే ఆమె మోముపై క్రమ్మిన చెమటబిందువులు వెన్నెల కిరణాలవల్ల రవ్వలల్లే కనుపించాయి. ఆమెకూడా ఫాలాబ్ధి కెరటము మాదిరున్న ఒక చలువ రాతి వేదికమీద అల్లే కూర్చుని 'చంద్రుడా చంద్రుడా పాటపాడ వోయి. బాగుందిగాని నువ్వుగూడా రావోయి. నిన్నుతప్ప వేరెవ్వరినీ చేసుకోనోయి!' అని గడుసుతనమంతా పోయిందా యేమి అన్నట్లు మాటాడింది.

వెంటనే యెదుటనున్న మల్లెమొల్లల పొదలో ఏదో చప్పుడయింది. అక్కడనుంచి ఎవరో కదిలి వచ్చారు.

దగ్గిరకివచ్చి ఇందిర ఎదుట నొక వింతమనిషి నిలబడ్డాడు.

అతని వంటినిండా తెల్లని జల్తారు దుస్తులే. అతనికి కిరీటం రవ్వలతో పొదిగింది. అతని శరీరం కనబడ్డచోటల్లా బంగారమే. అతని చేతిలో చిన్న తంబూర ఒకటుంది. అదీ వెండి పొదుగులతోనే వున్నది. అతన్ని చూస్తే నిజంగా చంద్ర మండలంనుంచే అవిర్భవించా డన్నట్లున్నాడు.

కొంచం భయంతో కొంచెం ఆశ్చర్యంతో కొంచెం మమతతో గద్గదిక స్వరంలో 'నీ పేరేమిటి?' అని అడిగింది ఇందిర.

'నాపేరు చంద్ర మోహనుడు.'

'నువ్వేనా చంద్రరాజువీ !'

'ఆ...నేను చంద్రవంశ రాజునే!

'ఇప్పుడు పాట పాడింది నువ్వేనా ?'

'అవును నేనే!'

'నువ్వే అని గుర్తెట్లా ?'

'అయితే విను ఈ పల్లవి !' అంటూ చంద్ర మోహనుడు ఇలా పాడాడు :

ఇందిరా! ఇందిరా! సొగసైన ఇందిరా !
సిందూరమేదేనీ ఫాలమందిరాన ?
ఎంత సౌభాగ్యమూ ఎంతందమున్ననూ
పెండ్లిలేని పడుచులకు సిందూరమేలేదు!
ఇందిరా! ఇందిరా! సొగసైన ఇందిరా
సిందూర మిదుగో యందుకో ముందు
నకురావే!

పాటవిని అప్రయత్నంగా ఇందిర ముందుకు వచ్చింది.

ఇందరను కౌగిలించుకొన్నాడు చంద్రమోహనుడు. ఆ కౌగిలితోనే ఆమెను లేవనెత్తుకొని పోయాడు.

పోతున్న యాతనితో 'ఎక్కడికి ? చంద్రలోకానికేనా ?' అని అడిగింది ఇందిర.

'పిచ్చిదానా చంద్రలోకం ఆకాశంలోవుంది. నారాజ్యం ఈ లోకంలోనే వుంది.' అన్నాడు.

'అయితే నువ్వబద్ధమాడావా? —ఛీ!' అంది ఇందిర.

'లేదు. నేను చంద్రవంశపు రాజు నన్నాను గాని చంద్రుణ్ణి అనలేదే !'

'ఓహో!' అంటూ తన తెలివితక్కువ తనం తాను గ్రహిం

చింది ఇందిర. తన గడుసు తనానికి తగినవాడల్లే నే వున్నాడీ రాజకుమారు డనుకున్నది.

"అయితే మీ దే దేశం ?" అన్నది.

'నేను అగ్నిమండల రాజకుమారుణ్ణి - నాకు గడుసు భార్యం టేనే యిష్టం. అందుకనే నిన్ను తీసుకుపోతున్నా పద. మీ తలిదండ్రుల దగ్గరకు పోదాం' అన్నాడు చంద్రమోహనుడు.

ఇందిర తలిదండ్రులు ఆ సంగతంతా విని సంతోషించారు. అగ్నిమండల దేశ రాజు గూడ ఉన్నత వంశపువాడే నని వారికి తెలుసు.

'నీ దేశపు పేరును సార్థకంగా మా దేశపు పేరును సార్థకంగా ఇందిరను కరగించావు. అంతే చాలు నాయనా!' అని ఆ వృద్ధ దంపతులీ బాల దంపతులను దీవించారు.



● బాల

● వింత బాల

● క్రొత్త వింత బాల

● సరి క్రొత్త వింత బాల

● నెల సరి క్రొత్త వింత బాల

● ఇది నెల సరి క్రొత్త వింత బాల


రచన: తొండపు వెంకటసీతారామయ్య (తాడికొండ)

# ★ సముద్రం ★

అబ్బాయి ఎప్పుడైన
చూశావా సముద్రాన్ని ?
కనుచూపువరకు
కనబడును నీళ్లు !
అంతు లేనే లేదు....
ఎంతవరకుంటుందో !

ఈ సముద్రములోనే
వెలలేని రత్నాలు
ఈ సముద్రములోనే
విలువైన ముత్యాలు
ఇందులోనే పండు
ఉప్పు మన కందరకు.
ఉప్పులేని కూర
చప్పగా వుంటుంది.

రచన: జి. కోటయ్య (జాతీయ రచనామండలి)




'కాంతి నాథ్'

చిట్టీ!

అమ్మ వ్రాసిన వుత్తరం జేరింది. అన్నయ్యను అరెస్టు జేశారనీ, జైలుకు పంపారనీ తెలిసి నీవు ఏడ్చావట. మారాం పెట్టి ఆ రోజంతా అన్నం తినలేదనీ, ఆటలాడుకోలేదనీ, పాటలు పాడుకోలేదనీ అమ్మ వ్రాసింది. అట్లా మంచికీ చెడ్డకీ మారాం పెట్టి ఏడ్వవచ్చునా చెల్లీ! మన అన్నయ్య అందరి అన్నయ్యల్లాంటివాడు గాదమ్మా! అందరి అన్నయ్యలు వాళ్ల చెల్లెళ్లను ప్రేమతో చూచినా, చూడకపోయినా వాళ్లుమాత్రం పశువుల్లాగా తిని బజార్లవెంబడి తిరుగుతూంటారు. అల్లరిపనులు జేస్తూ ఇతరులకు బాధను కలిగిస్తూంటారు. మన అన్నయ్య బీదసాదలను కాపాడడానికి, వారి కష్టాలను పోగొట్టడానికి ఎప్పుడూ పని జేస్తూంటాడు.

ఎంతమంది బిచ్చగాళ్లు, ఎంతమంది కూలీలు తింటానికి తిండి లేక, కట్టుకోడానికి బట్టలేక అల్లాడిపోవడం లేదు? వాళ్ల పిల్లలకు చదువు చెప్పించుకోనేందుకు డబ్బులేక వాళ్ళ జీవితాలన్నీ చమురులేని దీపాలకు మల్లే కొడిగట్టి ఆరిపోతూంటే, మనమో లడ్లూ జిలేబులూ తింటూ తెల్లటి గౌనులు వేసుకొని కార్లమీద షికార్లు కొడుతున్నాం గదూ!

చెల్లీ! జ్ఞాపకంవుందీ! నీవూ నేనూ, నానమ్మ, వొదినరాధమ్మ, జ్యోతిబాబు మనమంతా కారుమీద 'విశ్రాంతిపురం' చూడటానికని పోతూ దారిలో ఒక కాలవొడ్డున కారు ఆపి టిఫిన్ తీసుకొన్నాం. జ్ఞాపకం వచ్చిందా చెల్లీ! ఆ వూరి వెలుపల కాలవొడ్డున కొన్ని పూరి గుడిసెలున్నాయ్. ఆ గుడిసెలకు సరిగ్గా కప్పులైనా లేవు. తాటాకు లెగిరిపోయిన ఆ గుడిసెల్లోంచి గోచీ లెట్టుకున్న మొగపిల్లలూ, చిరుగుల లంగాలు కట్టుకొన్న కొంతమంది ఆడపిల్లలూ, మనల్నిజూచి ఏదన్నా పెడతామనే ఆశతో

మన కారుదగ్గరకు పరిగెత్తు కొచ్చారుగదూ! అప్పుడు మన 'జ్యోతిబాబు' మామిడిపండు తింటూన్నాడు. అంతా తినేసి టెంకను దూరంగా పారేసాడు. ఆ ఎంగిలి టెంకకోసం ఆ బీద పిల్లలు కాకుల్లాగా మూగారు. ఒకళ్ళమీద ఒకళ్ళుపడి కుక్కల్లాగా పోట్లాడుకొన్నారు. చూడు: వాళ్ళూ మనుష్యులేగదా! వాళ్లు అల్లా తిండికి మొగంవాచి ఆకలితో చీమల్లాగా చచ్చిపోతూంటే మనం ఈ విధంగా కులుకుతూ తిరగడం న్యాయమేనా చెల్లీ! తప్పుగదూ? "బీదవారిని కాపాడుము" అని పాఠంలో చదువుకొన్నావు. కాపీలు గూడా వ్రాశావు.

అందుకే అన్నయ్య నడుం బిగించి నడుస్తున్నాడు. ఆ బీదోళ్ల కోసమే, ఆ కూలోళ్ళకోసమే అన్నయ్య రాజకీయాల్లో పని జేస్తున్నాడు. వాళ్ళుకూడా మనలాగే సుఖపడాలనీ, వాళ్ళకూ్కడా తిండీ, బట్టా, ఇల్లూ వాకిలీ కలిగేటట్లు చేయాలని అన్నయ్య ఆశయం. ఆకలితో, అజ్ఞానంతో అణగారిపోతున్న కోట్లకొలది ప్రజలకు భూలోకంలోనే స్వర్గ సౌఖ్యాలన్నీ అనుభవించాలని అన్నయ్య అనేక శ్రమలు పడుతున్నాడు.

కాని అన్నయ్యను జూచి పోలీసులు బెదరిపోయారు. అన్నయ్య విప్లవకరమైన పనులేవో చేస్తున్నాడనే నేరంతో అరెస్టు జేసారు. శిక్ష విధించి జెయిలుకు పంపారు. అయినా యీమాత్రం దానికి అన్నయ్య బెదిరిపోతాడా? జెయిలునుంచి తిరిగివచ్చాక అన్నయ్య నీకన్ని సంగతులు చెబుతాడు. ఈలోపుగానే జైలు నుంచి నీకు వుత్తరం వ్రాయమని అన్నయ్యకు వ్రాస్తాను. మన అన్నయ్య ఇల్లాంటి మంచిపనులు జేస్తూ, దేశసేవ జేస్తూంటే మన మెందుకు దిగులుపడాలి? ఇంకా మనం అన్నయ్యకు ధైర్యాన్ని కలుగజేస్తూ చేదోడు వాదోడుగా వుండొద్దా చెల్లీ! అందుకే దిగులు పడకు. చక్కగా చదువుకో. కమలకు 'జ్యోతిబాబు' కు ముద్దులు.

నీకు ప్రేమాశీస్సులు...

నీ ప్రియమైన అక్క.

'రాజ్యం'



# బాలసేన సంఘము

రచన: పినపాల వేంకటేశ్వరరావు బి. ఏ.

("సికిందరు" చిత్రంలోని "జిందగీ సెప్యార్ హై" అనుపాట మాదిరిగా పాడాలి)

బాలసంఘ సభ్యులం
భావి భరతవీరులం
బాలచంద్ర సుతులగన్న
భారతాంబ బిడ్డలం ॥బా॥

గోడిబిళ్ళ మానరా
గోలికాయ లేలరా ?
అల్లరెక్కువైన దంచు
అమ్మనాన్న తిట్టరా ? ॥బా॥

బడికిబోవ రండిరా
పాఠములను చదువుదాం
అయ్యవారు చెప్పుచదువు
ఆలకించి తీరుదాం ॥బా॥

హెచ్చుతగ్గు లేలరా
కులము మతము గోలలా
బాలకులము బడికిపోయి
కలసి మెలసి చదువగా ॥బా॥

ఒకరు తక్కువేలరా ?
ఒకరి ఎక్కువేమిరా ?
విద్యనేర్చు వారికెల్ల
తెలివితేట లబ్బవా ? ॥బా॥

మురికిబట్ట విడువరా
దినముస్నాన మాడరా
అపరిశుభ్ర మైనవారి
కంటువ్యాధు లంటవా ? ॥బా॥

తగవులాట మానుదాం
తెగనిప్రేమ పెంచుదాం
ఐకమత్య బలమువలన
అభ్యుదయము నొందుదాం ॥బా॥

బంతులాట ఆడుదాం
చింతలన్ని మానుదాం
కండబలము లేనివారి
కుండబోదు జీవితం ॥బా॥

కష్టపడుట నేర్చుదాం
పుష్టిగలిగి బ్రతుకుదాం
కష్టజీవు లైనవారి
కష్టములను గాచుదాం ॥బా॥

తాడిలేవ పోవటం
ఎండి మాడి చావటం
ఆంగిలేయ ప్రభువుబోవ
అణగునంచు చాటుదాం ॥బా॥

పేదసాద బిడ్డలూ
అంటరాని పిల్లలూ
చదువుకొనగ రమ్మనంచు
చనువుజేసి పిలిచెదం ॥బా॥

తెలుగుగడ్డ మనదిరా
తెలుగుభాష మనదిరా
తెలుగుతల్లి బంధనాలు
తెంపివేసి తీరుదాం ॥బా॥

# ★ బాలతో వాదన ★

రచన: కొండపల్లి వెంకట రామదాసు (తుని,)


| | | |
|---|---|---|
| అమ్మా ! | అమ్మా ! | ఏమి అమ్మా ? |
| కొమ్మా ! | కొమ్మా! | లేత కొమ్మ ! |
| నాన్నా ! | నాన్నా ! | ఏమి నాన్నా ? |
| వెన్నా ! | వెన్నా ! | ఆవు వెన్నా ! |
| అన్నా ! | అన్నా ! | ఏమి అన్నా ? |
| పెన్నా ! | పెన్నా ! | కొత్తపెన్నా ! |
| అక్కా ! | అక్కా ! | ఏమి అక్కా ! |
| చెక్కా ! | చెక్కా ! | పీటీ చెక్కా ! |
| చెల్లీ ! | చెల్లీ ! | ఏమి చెల్లీ ? |
| పిల్లీ ! | పిల్లీ ! | తెల్లపిల్లీ ! |
| తమ్ముమా ! | తమ్ముమా ! | ఏమితమ్ముమా ? |
| తెమ్ముమా ! | తెమ్ముమా ! | కాగితమ్ముమా ! |
| అత్తా ! | అత్తా ! | ఏమి అత్తా ! |
| మెత్తా ! | మెత్తా ! | పొయ్యిమెత్తా ! |
| మామా ! | మామా ! | ఏమి మామా ? |
| చీమా ! | చీమా ! | ఎఱ్ఱచీమా ! |
| బావా ! | బావా ! | ఏమి బావా ? |
| కోవా ! | కోవా ! | పాలకోవా ! |
| అవ్వా ! | అవ్వా ! | ఏమి అవ్వా ? |
| బువ్వా ! | బువ్వా ! | పెరుగు బువ్వా ! |
| తాతా ! | తాతా ! | ఏమి తాతా ? |
| పీతా ! | పీతా ! | ఎండ్రపీతా ! |
| పేరా ! | పేరా ! | నాదు పేరా ? |
| బాలా ! | బాలా ! | బాలబాలా ! |

# చీర పాట

పడెయ్యా మొలచింది - పత్తెయ్యాచెట్టు
వెన్నెల్ల మహాదేవి - వడికింది నూలు
మొదటనే నేసేడు - మొగ్గల్లతోను
చిగురునే నేసేడు - చిలకల్లతోను
అంచునే నేసేడు - అతిమంచి వనము
ఝామెక్కి మగ్గాన్ని - జలతారు నేసె
ప్రొద్దెక్కి మగ్గాన్ని - పొన్నల్లు నేసె
ప్రొద్దు పొడుపుండేటి - సూర్యుణ్ణి నేసే
చల్లదనమిచ్చేటి - చంద్రుణ్ణి నేసే
సరిజేసి నేసెతా - చక్కని చీర
నవ్వుచూ మాబాల - యీచీరకట్టె.

సంపాదన: ఎ. రాజేశ్వరి (అనకాపల్లి)

# బొమ్మలపద్యం



తలనుండు


విషము

ఫణికిని

వెలయంగా

తోకనుండు

వృశ్చికమునకున్



తల, తోక యనక యుండును




ఖలునకు

నిలువెల్ల విషము

కదరా! సుమతీ!

బొమ్మలు, సంపాదన: సి. కాళీచరణశర్మ 6-వ ఫారం, నూజివీడు.



# మన నగరములు

మల్లికార్జున సిద్ధాంతి

మన దేశము హిందూ దేశము. దీనినే ఇండియా అంటారు.

హిందూ దేశము మన మాతృ దేశము - అనగా మనకు తల్లి వంటిది. మన దేశములో గొప్ప నదులు ఉన్నవి. అవి భూమిని సారవంతము చేస్తున్నవి. సారవంతమైన ఈ భూమి మనకు కూడూ గుడ్డా ఇస్తున్నది.

మన దేశములో గొప్ప పర్వతములున్నవి.

మన దేశములో గొప్ప ఋషులుపుట్టారు. గొప్ప కవులు పుట్టారు. గొప్పరాజులు, గొప్ప మంత్రులు పుట్టారు.

మన దేశములో గొప్ప నగరములున్నవి.

మన దేశమునుగురించి మనము పూర్తిగా తెలుసుకోవాలి. మన దేశము గొప్ప నిలబెట్టడానికి మనము ప్రయత్నము చేయాలి.

మన నగరములనుగురించి ముందుగా నేర్చుకొందాము.

* * *

మన దేశపు తలవాకిలి:

నీవెప్పుడైనా బొంబాయి పేరు విన్నావా?

మన నగరములలో అదీ ఒక పెద్దనగరము. అది మన దేశపు పడమటితీరాన్ని ఉంది.

దానికాపేరు ఎందుకు వచ్చిందో చెప్పనా?

ఒకప్పుడు బొంబాయి చిన్న పల్లెటూరు. జాలరివాళ్లు కాపురముండేవారు. సముద్రములో చేపలుపట్టి వాటిని బజారులో అమ్మి డబ్బు తెచ్చుకొనేవాళ్లు.

ఆ ఊళ్లోనే ఒక పెద్ద గుడి ఉంది. ఆగుళ్లో ఒక దేవతఉంది. ఆమెపేరు "మూంబాయ్". ఆ గ్రామస్థులు ఆ దేవతను భక్తితో పూజించేవాళ్ళు. ఆ ఊరికి ఆ దేవతపేరే పెట్టారు. అందువల్ల ఆగ్రామము "మూంబాయి" అయినది.

పదహారవ శతాబ్దమున ఈ గ్రామము పోర్చుగీసువారి ఆధీనములో ఉండెను. ఆ రాజు తన కూతుర్ని ఇంగ్లీషురాజుకిచ్చి పెండ్లిచేశాడు. అప్పుడు ఈ గ్రామాన్ని కూతురికి అరణంగా యిచ్చాడు. తరవాత ఇంగ్లీషు రాజు తూర్పు ఇండియా వర్తక సంఘానికి షుమారు 200 రూపాయలకు అమ్మేశాడు. తరవాత అది ఇంగ్లీషు ప్రభుత్వంలో చేరింది. ఇంగ్లీషువాళ్ళు "మూంబాయి" అనేమాట సరిగా పలకలేక "బొంబాయి" "బోంబే" అనడం మొదలు పెట్టారు. బొంబాయి అనే పేరు దానికి నిలిచిపోయింది.

క్రమక్రమంగా ఆ గ్రామం పెద్ద నగరమైనది. ఇప్పుడది ఎంత అందమైన పట్టణమైనదను కొన్నావు. ఎంతో అందమైన మేడలు. మనకు బట్టలు నేసి పెట్టే మిల్లులు. వర్తకంచేసేవారు ముఖ్యంగా పార్సీలు అక్కడ ఎక్కువగా ఉన్నారు.

నిజానికి బొంబాయి ఒక చిన్నద్వీపము. ఆ ద్వీపంలోనే బొంబాయి నగరమున్నది. బొంబాయికీ ఇండియాకీమధ్య వంతెనలున్నాయి. ప్రపంచంలో అన్ని దేశాలనుంచీ చిన్నవీ, పెద్దవీ స్టీమర్లు బొంబాయి చేరతాయి. ఇవి చేరడానికి బొంబాయిలో హార్బరు ఉంది. హార్బరంటే పడవలూ, స్టీమర్లూ ఉండేచోటు. అక్కడికి వెళ్లిచూస్తే సముద్రం, సముద్రంమీద చిన్నవీ, పెద్దవీ పడవలూ కనిపిస్తాయి.

మన యిళ్ళకి తలవాకిలి ఉంటుందికదూ. అట్లాగే ఇండియాకుకూడా తలవాకిలి ఉంది. ఆ తలవాకిలే బొంబాయి. ఇతర దేశాలవాళ్ళు ఇండియా రావాలంటే బొంబాయి మీదుగానే వస్తారు. అందుచేతనే బొంబాయిని ఇండియాతలవాకిలంటారు.

# వానరోజున

బుటుసు వారబ్బాయ్

వాన! వాన!! అబ్బ ఎంత వానో! అప్పటిదాకా ఎండల వల్ల మాడి మోడై వున్న మొక్కలన్నీ మళ్లీ తలెత్తుతాయి అని సంతోషపడుతున్నా రందరూ. కరువుకాలం, ఇప్పుడైనా సస్యం బాగా ఫలిస్తే బాగుండునని ఆశపడుతున్నారు.

ఆహాహా! ఏం వాన! నిమిష నిమిషానికీ జోరు హెచ్చిపోతోంది. చిన్న చిన్న పాయలన్నీ కలిసి రోడ్డుకు ఇటూ అటూ పెద్ద ఏరుల లాగ ప్రవహిస్తు న్నాయి. అరే! ఒక్క నిమిషంలో రోడ్డంతా ఏక ప్రవాహమైపోయిందే! మా ఇంటి వీధి అరుగు మెట్లల్లో రెండు మెట్లు మునిగిపోయాయి.

నేను వీధిలో ఒక స్తంభాన్ని ఆనుకుని వాలుగా పడే పెద్ద పెద్ద వర్షపు చినుకుల్ని చూస్తూ నిలబడ్డాను.

"అన్నయ్యా" అంటూ వెనక్కాలే వచ్చి నిలబడింది మా సుశీల.

"చూశావా చెల్లీ, ఎంత బాగా కురుస్తోందో వాన. జల్లు వచ్చి మొహాన పడుతూంటే నీకు బాగులేదూ"

"చాలా బాగుంది. పట్ట పగలు ఎంత చీకటిగా ఉందో!"

'మన బడివేళ అయినట్లుంది'

'ఇవాళ మనం బడికివెళ్ళద్దు. ఇక్కడేవుండి ఆడుకుందాం, పడవలూ అవీచేసి, నీళ్లల్లో కాళ్ళీడ్చుకుంటూ నడుస్తూంటే ఇంకా ఎంతో బాగుంటుంది.'

'నిజమే. చాలా బాగుంటుంది. కాని ఏంవంకపెట్టి బడి మానెయ్యడం అనేదే ప్రశ్న' అన్నాను ఆలోచిస్తూనే.

'నీకు తలనొప్పిగా ఉంది అని అమ్మతో చెప్పు. నాకు కడుపులో పోటుగా ఉందంటాను.'

అవీ తెలివితేట లంటేను! సమయానికి 'ఠక్'న అతిగేమాట అంది. నిన్నటివరకూ మా చెల్లి బుర్రలోది మెదడుకాదు, శుద్ధ కర్రలేని మట్టి అనేవాణ్ణి. కాని ఇప్పుడు ఆ అభిప్రాయం మార్చు కుంటాను. నాకంటెకూడా అఖండమైన తెలివితేటలు దానికి ఉన్నాయి అని ఒప్పుకుతీరుతాను.

సరే అంటే సరే అనుకున్నాం. ఆడవసిన నాటకం అంతా వీధిలోనే 'రిహార్సలు' వేసుకుని మా అమ్మదగ్గర 'తూచా' తప్పకుండా అడేశాం, మేం అనుకున్న కోరిక నెరవేరింది.

'మిరియాల కసాయం పుచ్చుగో. అన్ని రోగాలూ వదులుతాయి' అంది మా అమ్మ.

పుచ్చుకు తీరాలి. తప్పదు. సుఖం కావాలంటే ముందర ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కోవాలిగా మరి!

* * *

ఎదరింటి శాస్త్రుల్లగారమ్మాయి అబ్బాయికూడా మాతో కలిసి ఆడడానికి ఒప్పుకున్నారు. మరి వాళ్లు ఏం ఎత్తువేసి వాళ్ళవాళ్ళని టోపీలో వేశారో!

ఇంట్లో ఉన్న పాత కాగితాలన్నీ పైకొచ్చాయి. పెద్ద పెద్ద ఓడలు, మధ్యరకం పడవలు, చిన్న చిన్న డింగీలు, జంట పడవల్లు, కత్తెర పడవలు—అబ్బో చాలా రకాలు తయారు చేశాం. మేమందరం నీళ్ళలో దిగి ఒక్కొక్కటే ఒదిలిపెట్టేం. కొన్ని కొన్ని కదలనని భీష్మించుకు కూర్చుంటే 'ఉఫ్ ఉఫ్' అని ఊది బయలుదేర తీసే వాళ్ళం.

పడవలు ప్రయాణం చేసి చేసి ఏ అరుగు దగ్గరకో జేరేవి. వాటిని పెద్ద చీపురు పుల్లలు పుచ్చుకొని ప్రవాహంలోకి తోసే వాళ్ళం. అప్పు డప్పుడు ఇష్టంలేక పోయినా మా అమ్మ బలవంతంవల్ల, కొట్టుతుందేమోనని భయంవల్ల బడికివెళ్లే మాకుమల్లే బయలుదేరేవి ఆ పడవలు. కొన్ని కొన్ని మధ్యలోనే మునిగి పోయేవి.

మా ఇంకో చెల్లెలు చిట్టి చాలా అల్లరిపిల్ల. అది చూడకుండా ఆడుకుందామని మా

ప్రయత్నం. కాని అది ఎప్పుడు చూసిందో వీధిలోవచ్చి నిలబడి చిన్న చిన్న రాళ్ళు విసరడం మొదలు పెట్టింది. ఆ రాళ్ళు మా పడవలకి బాంబుల్లాగ తగి లేయి. ఒక్కొక్క పడవే మునిగి పోవడం మొదలుపెట్టింది.

'అమ్మా చిట్టిని చూడవే. మా పడవల్ని ముంచేస్తోంది.' అని అనుకోకుండానే గట్టిగా అనేశాను.

కొంప మునిగింది. మా అమ్మ నా కేక విని వీధిలోకి వచ్చింది.

'ఓరి వెధవాయ్! తలకాయ నొప్పిగా ఉందని నీళ్లలో ఆటలు ఏమిటిరా? కడుపులో పోటుగా ఉంది పడుకుంటానని చెప్పి నీకేమిటే ఆ ఆటలు. ఇంకా ఇంట్లోకి రారేం?' అని మా అమ్మ అనేసరికి బిక్కమొహం వేసుకుని ఇంట్లోనివచ్చి దుప్పటీ కప్పుకుని పడుకున్నాం.

జరిగినదంతా 'బాల'కి పంపిద్దాం అని నేను, మా సుశీల కూడ బలుక్కున్నాం — మా అమ్మకి వినపడకుండానే.

# వింతమాటలు

[ఈ క్రిందిమాటలు ఎటునుండి చదివినా ఒకటే! ఇలాటివి ఎన్ని వ్రాయగలరో చూడండి.]

వికటకవి

లతలతల

తోక మూకతో

గులాబిలాగు

మీసాలసామీ

మందారదామం

పంచాశ్యచాపం


రంగనగరం

సంపాదన:

బి. వి. వి. ఆర్

(సత్తెనపల్లి)

# ★ నీ అదృష్టం! ★




ఆ    శు    తా    నీ

పై నాలుగు అక్షరములలో ఒకదానిని తలచుకొనుము. దానిని ఒక దగ్గర వ్రాసి వుంచుకొనుము. బొమ్మలో ఆ అక్షరము చూడుము. దానిని విడిచి. బాణము పెట్టిన దిక్కుగా ఏడవ అక్షరమును లెక్కపెట్టి వ్రాసికొనుము. తరువాత ఏడవ అక్షరమును వ్రాసికొనుము. ఇట్లు మొత్తము ఏడుఅక్షరములు వ్రాసికొని వాటిని వాక్యముగా చదివిన నీకు జ్యోతిషము ఈ చక్రము చెప్పును.

రచన: జక్కుల ప్రకాశరావు (అనకాపల్లి)

# ఈథరు మహాత్మ్యము

♦ ♦ రచన: డి.

ఈథరు మహాత్మ్యంట! ఎవరుచెప్మా యీ ఈథరు ? ఏదో వేంకటేశ్వర మహాత్మ్యం అనీ, దేవుడి మహాత్మ్యం అనీ, లేకపోతే ఏదో అమ్మవారి మహాత్మ్యం అని విన్నాముగాని, యీ ఈథరు ఎవరూ అని కంగారు పడేరు సుమా! ఆ! తెలిసింది. ఏదో బైబిలు కథ ఐనా అవాలి లేకపోతే ఏ గ్రీకో, రోమనో దేశాల కథ అయినా అవాలి; యీ ఈథరు వాళ్ళ దేవుడో, దెయ్యమో అవాలి అని ధైర్యంగా అనుకునేరు సుమా! మీరనుకున్నట్టు ఈథరు దేవుడుగాదు, దెయ్యమూగాదు, గ్రీకు, రోమను సంబంధించిన కథా కాదు.

అన్ని దేశాలకు సంబంధించినదే యీ ఈథరు మహాత్మ్యం అంటాను. అట్లా అయితే మరి యీ ఈథరు ఎవరు ? మనిషా ? జంతువా ? పేద్ద నదియా లేక పర్వతమా ? ఏదైనా యంత్రమా? లేకపోతే ఏదైనా ఆటం బాంబులాంటిదా ? లేకపోతే ఏదైనా...ఏదైనా...అని వూరికే ఆలోచిస్తున్నారా ? మీరాలోచించినట్టే ఏదీకాదు, తొందర పడకండి చెప్తాను.

పూర్వము హిరణ్యాకశిపుడు, ప్రహ్లాదుణ్ణి 'నీ దేవుడు ఎక్కడున్నాడు' అని అడిగితే ఏమన్నాడో మీ అందరికి తెలుసుగా. ఎక్కడ పడితే అక్కడేవున్నాడు దేవుడు అన్నాడు.

"ఇందుగల డందు లేడను సందేహము వలదు" అన్నపద్యం మీరంతా చదివే యుంటారు. అల్లాగే యీ ఈథరు ఎక్కడ పడితే అక్కడేవుంది. ఇది లేని

# రేడియో వింత

శ్రీనివాసరావు (మదరాసు)

చోటు లేదు. ప్రపంచమంతా నిండివుంది.

ఏమిటీ! ఎక్కడ పడితే అక్కడ వుందా? అటయితే మేం చూడమా? మాకు తెలియదా? అని ఆశ్చర్య పడుతున్నారా? అవును. ఆశ్చర్యమే మరి! ఎందు కంటారా ఈథరు కంటికి కనుపించదు. సరే గాలికూడా కంటికి కనుపించదు. కానీ వెచ్చగానో, చల్లగానో వంటికేనా తగుల్తుందిగా అని అంటున్నారా? కాని ఈథరు వంటికికూడా తగలదు. ఆఖరికి చెప్పాలంటే ఏవిధమైన వాసనా వెయ్యదు. పోనీ చెవులతోనైనా విందామంటే ఏవిధమైన శబ్దమూ పుట్టించదు.


అట్లాంటి ఈథరువుంటే ఎవరిక్కావాలి? ఓస్! ఇదేనా ఈథరు మహాత్మ్యం అని హేళనచేస్తారా? వద్దు. వినండి—

ఎక్కడో చాలా దూరంగా వున్నాడు సూర్యుడు. అయినప్పటికీ, సూర్యుని వేడిమి మనకు తగుల్తోంది. వెల్తురును చూస్తున్నాము. ఈ వేడిని, వెల్తుర్ని ఈథరే మనకి తీసుకొచ్చి ఇస్తోంది. అంటే సూర్యుని దగ్గఱనుంచి, వేడి, వెల్తురు, ఈథరు మూలంగా ప్రయాణంచేసి మనదగ్గఱకు రాగల్గుతున్నాయన్న మాట. ఇదంతా ఈథరు మహాత్మ్యం కాకపోతే ఏమిటి?

ఇదేగాదు. ఇంకో విశేషం కూడా వుంది. రేడియో అంటే ఏమిటో మీ అందరికీ తెలిసే వుంటుంది. ఎక్కడెక్కడో పాడిన పాటలు, ఎక్కడెక్కడో మాట్లాడిన మాటలు, రేడియో మూలంగా మనం వినగల్గుతున్నాము.

మీలో చాలామంది వినే యుంటారు. మద్రాసునుంచి గానీండి, బొంబాయినుంచి గానీండి, ఢిల్లీనుంచి గానీండి, ఆఖరికి లండనునుంచి కూడా అయినా సరే ఏవరైనా మాట్లాడితే తక్షణం మనం ఎక్కడున్నా సరే రేడియో మూలంగా వినగల్గుతున్నాము. ఆశ్చర్యం కాదూ! రేడియో పనిచేస్తోంది అంటే ఈథరుయొక్క మహాత్మ్యమే. ఈథరుకి రేడియోకి ఏంసంబంధం వుంది? అని అడుగుతున్నారా? వినండి. మద్రాసు రేడియోస్టేషనులో ఎవరైనా మాట్లాడుతున్నారనుకోండి. ఆ మాటలన్నిటినీ, అక్కడున్న యంత్రాలు. మన కంటికి అగుపడని కెరటాలుగా మారుస్తాయి. ఆ రేడియో మాటల కెరటాలు ఈథరు మూలంగా ప్రపంచమంతా ప్రయాణంచేస్తాయి. ఈథరు లేనిచోటు లేదనీ, ఈథరు ప్రపంచమంతా నిండి వుందనీ తెలుసుకున్నాము. మన రేడియోదగ్గఱకు, రేడియో కెరటాలను ఈథరు మోసుకొస్తుంది. ఆ రేడియో కెరటాలను మన రేడియో తిరిగి మాటలుగా మారుస్తుంది.

ఈథరులో రేడియో తరంగములు (అంటే కెరటాలు) ఎంత వేగముగా ప్రయాణం చేస్తాయనుకున్నారు! కన్నుమూసి తెరిచేలోపల (అనగా ఒక సెకండులో) 1,80,000. మైళ్ళు ప్రయాణం చేస్తాయి. అంత వేగముగా ప్రయాణం చేయిస్తాయి గనుకనే రేడియోస్టేషనులో ఎవరైనా మాట్లాడడం తడవుగా మనం మన రేడియోలో వినగల్గుతున్నాము. ఇప్పుడైనా ఒప్పుకుంటారా ఈథరు మహాత్మ్యం.





# పొడుపు కథలు

## 1

ముగ్గురు దొరలకు ఒకటే టోపీ !

సంపాదన: మద్దాళి లలితాంబ (ఏలూరు)

## 2

నెల్లూరు అవతల లేత మామిడి చెట్టు
పూత పూయకుండా కాయలు కాచు

సంపాదన: శివరాజు సుబ్బరామయ్య (గన్నవరం)

## 3

గరుకు గరుకుల బండ ఘనమైన బండ
పెద్దిరాజుల బండ పేరైన బండ

సంపాదన: ధూళిపాళ్ళ వీరయ్య

## 4

చుక్కలు, సుడి బొమ్మలు
చూచేవారేకాని, కాసేవారులేరు

సంపాదన: ధూళిపాళ్ళ లక్ష్మీనారాయణ

---

వీటి జవాబులు ఈ సంచికలోనే వున్నాయి.

# ఎగదీస్తే బ్రహ్మహత్య - దిగదీస్తే గోహత్య !

రచన: విద్వాన్ చాడ విశ్వేశ్వరరావు (వేల్పూరు)

అనగా అనగా ఓవూళ్ళో రాజుండేవాడు. అతనికి ఓ తెలివైన మంత్రి ఉండేవాడు. ఆ రోజుల్లో ధర్మయుద్ధం చెసేవారు. అంటే బ్రాహ్మల్ని చంపకూడదు. గోవుల్ని చంపకూడదు. ఆడాళ్ళి బాధపెట్టకూడదు. ఎదరి వాడి దగ్గిర కత్తి కఠారి లేకపోతే వాడితో యుద్ధం చేయకూడదు. యీలావుండగా రాజుగారి భార్యకి ఈ తెలివైన మంత్రి వుండడం యిష్టం లేకపోయింది. ఏలా అయితే రాజుని బాధపెట్టి మంత్రిని తప్పించివేసింది. ఆ మంత్రి పదవి తనతమ్ముడికి యిప్పించింది. ఆ అబ్బాయి ఓ చేతకాని సుబ్బారాయుడు. ఎంతసేపూ మీసాలు దువ్వుకోడంతప్ప యింకేమీ చేతకాదు. మొదటిమంత్రిని తీసెయ్యడంతోటే రాజుగారి సైన్యం చాలామట్టుకు కోపం వచ్చి యిరుగుపొరుగు శత్రురాజులదగ్గిరకు చేరిపోయింది. ఈ సైన్యం కూడా చేరడంతోటే వాళ్ళకు బలం యెక్కువయింది. పైగా తెలివైన మంత్రి లేడుకూడాను. బలేసమయందొరికిందని ఈరాజుగారిమీదకి దండెత్తి యుద్ధానికి వచ్చారు. మరిచూచుకో కొత్త మంత్రిగారు, కోటలోంచి యివతలకువస్తేగా! రాజుగారికి కంగారు యెక్కువయింది. మొదటి మంత్రిని తీసివేయడం బుద్ధిపొరపాటు అనుకొని తిన్నగా వెళ్ళి మొదటిమంత్రిని తనతప్పిదం క్షమించమన్నాడు. ఏలాగో రాజ్యాన్ని నిలబెట్టమన్నాడు.

మొదటిమంత్రి మంచి తెలివైనవాడన్నానుగా. సరేనని రాజుగారితో బయలుదేరాడు. ఊళ్ళో ఉన్న బ్రాహ్మల్నందర్నీ కబురంపాడు. ఒక్కొక్క బ్రాహ్మ

డికి ఒక్కొక్క ఆవు యిచ్చాడు. ఆ బ్రాహ్మల్నందర్ని ఆ ఆవుల్ని యెక్కమన్నాడు. ఆ లా యెక్కి శత్రురాజులసైన్యంమీదకి వెళ్ళమన్నాడు. సరేనని బ్రాహ్మలు ఆవుల్నియెక్కి జారీచెంబులికి అంగవస్త్రాలు చుట్టి గిరగిరతిప్పుతూ యుద్ధానికివెళ్ళారు. శత్రుసైన్యం తయారుగావుంది. ఎదురుగుండా బ్రాహ్మణసైన్యంవస్తోంది. పైకి బాణాలు పెట్టికొడదామంటే బ్రాహ్మలుచచ్చిపోతారు. పోనీ క్రిందగా కొడదామంటే ఆవులు చచ్చిపోతాయి. మరీ పాపం కూడాను. బలే చిక్కువచ్చింది. ఎగదీస్తే బ్రహ్మహత్య, దిగదీస్తే గోహత్య. ఏమీచేయలేక శత్రుసైన్యం తిరిగి వెళ్ళిపోయింది. మొదటిమంత్రి తెలివికి రాజు సంతోషించిబహుమానంయిచ్చి మళ్ళీ ఉద్యోగం యిచ్చాడు. వెనుకటి సైన్యాన్ని అంతా చేర్చాడు. యుద్ధానికి వెళ్ళిన బ్రాహ్మలకి భోజనాలు పెట్టాడు. తెలిసిందా. అదీ కథ.


జాబ్‌కో
వస్తువులు
అన్నీ స్వదేశీవే.

మీకు కావలసినవి — సబ్బులు, నూనెలు, పౌడర్లు మొదలైనవన్నీ జాబ్‌కోవారే తయారుచేస్తున్నారు. మీరు స్వదేశీవస్తువులనే వాడవలెనని వేరే చెప్పాలా? జాబ్‌కో మార్కుగల వస్తువులే, అన్నిటి కంటే ప్రసిద్ధమైనవి. స్వదేశీనే కొనుడు. జాబ్‌కోనే కొనుడు.

★

మేము తయారుచేయు వస్తువులు:

హేర్ గ్రోయర్, స్నో, లిక్విడ్ బ్రిలెంటైన్, బ్రిలెంటైన్, సుగంధపు ఆముదం, సుగంధపు కొబ్బరి నూనె, లైంగ్లిస్, హెర్బాం, శాండల్ ఉడ్ సబ్బులు మొదలైనవి.

★

జయభారతం కంపెనీ
మదరాసు - బెంగుళూరు - ఎర్ణాకులం.

కవి మహిమ:

# అన్నం అంతా సున్నం

రచన: అనుమలశెట్టి వెంకట

పిల్లలారా! మీకంతా 'బాల' చాలా చాలా పద్యాలు పాటలు చెబుతుందికదూ. ఈ పద్యాలూ పాటలు నేర్చుకొని మీరంతా హాయిగా ఆడుతూ పాడుతూ వుంటారు. ఇవి ఎలా వొచ్చాయో మీకు తెలుసా? చెబుతా వినండి.

మా తాత నాకేంచెప్పాడో చెప్పనా? ఇలాంటి పాటలు పద్యాలు వ్రాసేవాడిని 'కవి' అంటారంట. కవిగూడా మనలాంటి ఓ మనిషే. కాని, కవి ఏంచేస్తాడూ, తాను చూచినవి, ఊహించినవి, అనుభవించినవీ అన్నీ అందంగా మాటల్లోకూర్చి రాస్తాడు. అది చదువుతే మనలో కూడా హాయి,ఉద్రేకంపుడ్తుంది.

ఇలాంటి కవులు మన దేశంలో ఎంతోమంది వున్నారు, వాళ్ల కథలు వింటూవుంటే బలే బలేగా వుంటాయి. మీరు శ్రద్ధగా వినాలి. పూర్వపు ఒక కవి కథ చెబుతా.

900 ఏండ్ల క్రిందట ఓ కవి వుండేవాడు. ఆయనపేరు భీమన్న. మీకు తెలుసుగా పంచ పాండవుల్లో ఓ భీమన్న వున్నాడని. ఆయనగాదు. ఈ భీమన్న వేరు. ఈ భీమన్నను 'వేములవాడ భీమకవి' అనేవాళ్ళు. ఈయన ఎలా పుట్టాడో తెలుసా? వీళ్ళమ్మ ఓనాడు శివుడు కోవిలకివెళ్ళి టెంకాయ కొట్టి దణ్ణంపెట్టి నీలాంటి కొడుకు కావాలని కోరిందట. చూడండి దేముడికి ఎంత దయో! వెంటనే ఆవిడకో మంచి కొడుకు పుట్టాడట. ఆ దేముడు గోదావరి జిల్లాలో ద్రాక్షారామములో ఇంకా వున్నాడు. ఆయనపేరు భీమేశ్వరుడు. కాబట్టే యీ కొడుక్కి భీమన్న అని పేరుపెట్టారు. మీలాగే వాళ్ళమ్మకూడా పెంచి పెద్దవాడిని చేసింది.

ఇలావుండగా ఓనాడు వాళ్ళమ్మతో 'నాన్నేడే అమ్మా' అని యేడ్చాడట. మీ నాన్న ఆగుళ్లో దేముడేనని వాళ్లమ్మ చెప్పింది.

# సున్నం అంతా అన్నం

సుబ్బరాజమ్మ, కావలి.

అంతటితో వినకుండా ఓ రాయి తీసికొని 'మానాన్నవైతే నాతో మాట్లాడతావా లేదా!' అని గట్టిగా కొట్టబొయ్యేసరికల్లా దేముడు ప్రత్యక్షమయి నేనే మీనాన్ననని గట్టిగా చెప్పాడట. ఆలా అయితే నేనాడింది ఆట - పాడింది పాట. అయ్యేటట్లు వర మియ్యమన్నాడట. అలాగే యిచ్చి దేముడు వెళ్ళిపోయాడు. చూచారా, ఎంత విచిత్రంగా వుందో!

ఇలా వుంటూ వుంటూ వుండగా ఓనాడు ఆవూళ్ళో ఓ బ్రాహ్మణింట్లో భోజనాలు పెడుతున్నారు. ఆనాడు మన భీమన్నను భోజనానికి పిలువలేదు. యెవరు ఒప్పుకుంటారు? మీ రూరుకుంటారూ పిలవకపోతే? మీనాన్న దగ్గర ఏడుస్తూంటారుగా. అలాగే యేడ్చి మన భీమన్నకూడా వెళ్లాడు భోజనానికి. అయితే ఇంట్లోకి రాకుండా తలుపేసుకోని లోపల అంతా భోంచేస్తున్నారు. వాకిట్లో కూర్చుని మన భీమన్న అదంతా చూస్తూ ఓ పద్యము చెప్పాడు. అదేమిటంటే—

'అన్నము అంతా సున్నము అవాలి!

అప్పములన్నీ కప్పలు అవాలి!'

అంటూ పాడుకుంటున్నాడు. ఇంట్లో భోంచేస్తున్నారు గదూ. వాళ్ళ విస్తళ్లల్లో అన్నమంతా సున్నమైంది! అప్పములన్నీ కప్పలయి ఎగురుతున్నాయి. అందరూ భయపడి గోలపెట్టారు. అందులో ఓ ఆయన మన భీమన్న పాట విని ఇదంతా భీమన్నే చేశాడని చెప్పాడు. అప్పుడు వాళ్లంతా భీమన్న కాళ్ళమీదపడి రక్షించమన్నారు. మళ్ళీ భీమన్న—

సున్నము అంతా అన్నము అవాలి.

కప్పలుఅన్నీ అప్పములవాలి.

అని చదవగానే అప్పములు, అన్నం వచ్చేసింది. అందరూ భీమన్నను మెచ్చుకొన్నారు. చూడండి ఎంత విచిత్రంగావుందో! ఇలాగే వుంటాయి పూర్వపు ప్రతి కవి కథకూడా.

బాలలకు బహు మంచి పుస్తకములు

# రాయల వాచకములు

(1, 2, 3, 4, 5, తరగతులకు)

ఈ క్రింది శతకములు తెల్లని గ్లేజుకాగితమున చక్కని అక్షరములలో ముచ్చటగా ముద్రింపబడినవి. బాలలకొఱకు ప్రత్యేకముగ ప్రచురింపబడినవి.

| | | | |
|---|---|---|---|
| రామరామ శతకము | 0-2-0 | రాయల గణితబోధిని | 0-1-0 |
| నారాయణ శతకము | 0-2-0 | ఆంగ్లో తెలుగు ప్రైమరు | 0-5-0 |
| వేమన శతకము | 0-2-0 | నీతిశాస్త్రము తాత్పర్యము | 0-4-0 |
| సుమతిశతకము | 0-2-0 | డిటో టీకాతాత్పర్యము | 0-4-0 |
| కృష్ణశతకము | 0-2-0 | ,, ,, | 0-4-0 |
| బాలరామాయణము | 0-2-0 | ,, ,, | 0-4-0 |
| దాశరథి శతకము | 0-2-0 | ,, ,, | 0-6-0 |
| భాస్కరశతకము | 0-2-0 | ,, ,, | 0-8-0 |
| నరసింహశతకము | 0-4-0 | ,, ,, | 0-8-0 |
| గజేంద్రమోక్షము | 0-4-0 | ,, ,, | 0-8-0 |
| రుక్మిణీకల్యాణము | 0-4-0 | ,, ,, | 0-8-0 |
| అమరకోశము | 0 4 0 | ,, ,, | 0-8-0 |
| గృహసరస్వతి (ఇంగ్లీషక్షరములు) | 0- 4-0 | పుష్పగిరి మహాత్మ్యము | 0- 4-0 |
| నీతిచంద్రిక శుద్ధప్రతి | 0-10-0 | ఆంధ్రనామ సంగ్రహము టీకా | 0-01-0 |
| ప్రేమకుమారి (నాటకము) | 1- 0-0 | ప్రియదర్శిని (నవల) | 1- 0-0 |

మద్దులేటి నృసింహ శతకము, (కందపద్యములు పాకెట్ సైజు.) 0-2-0

వలయువారు :

## రాయలు అండు కో., పబ్లిషర్సు, కడప.

ఈ క్రిందివారివద్దకూడా పైగ్రంథములు దొఱకును. కొనునపుడు కడప రాయలు అండు కో వారి ప్రచురణములని అడుగుడు.

మదరాసు:-విజయమారుతి పబ్లిషింగ్ హౌస్, 6, సుంకురామశెట్టి వీధి.
బెంగళూరుదండు:-న్యూ ఆనందా బుక్ డిపో; 2-3 ధర్మరాజు వీధి
హిందూపురము:-కస్తూర్బా స్టోర్స్
అనంతపురము:-B. C. ఆదినారాయణశెట్టి
బళ్లారి :-K. L. బ్రదర్స్
గుంతకల్లు:-కొండా బసన్నశెట్టి
ద్రోణాచలము:-శ్రీ మాణిక్యా స్టోర్స్
కర్నూలు:-వి. రామకృష్ణయ్య
నంద్యాల :-ప్రభాకర అండు కో;
గుంటూరు:-వెంకటేశ్వర అండు కో;
చిత్తూరు :-ది. ఓరియన్టు పబ్లిషింగ్ కంపెని
తిరుపతి :-గోల్డన్ బుక్ డిపో, కాళహస్తి:- జె. సుబ్బరాయుడుశెట్టి.
నెల్లూరు :-V. V. నాయుడు అండు సన్సు
కావలి:-కామేశ్వర బుక్ డిపో;
తెనాలి :-సుందరరాం అండు సన్సు
అనకాపల్లి:-మాదేటి సాంబమూర్తి
సికింద్రాబాదు :-కొండా వీరయ్య

# రెండో ఎక్కం

రెండొకట్ల రెండు
ఉదయమే లెండు
రెండు రెళ్ల నాలుగు
రేడు ఎక్కు ఏనుగు
మూడు రెళ్ల ఆరు
ముద్దు చెల్లి నోరు
నాలుగు రెళ్ల ఎనిమిది
నాన్నమాట విను మది
అయిదు రెళ్ల పది
అది బొమ్మల గది
ఆరు రెళ్ల పన్నెండు
బాల నవ్వు గదినిండు
ఏడు రెళ్ల పధ్నాలుగు
ఎందు కొచ్చిన నీలుగు
ఎనిమిది రెళ్ల పదహారు
ఎక్కడుంది పొరుగూరు
తొమ్మిది రెళ్ల పద్దెనిమిది
తొందరెప్పుడు కూడనిది
పది రెళ్ల ఇరవయి
పలక తీసి వ్రాయి.

రచన : శెట్టి.

# మూడో ఎక్కం

మూడు వకట్ల మూడు
బ్రహ్మకు తలలు మూడు
మూడు రెళ్ళు ఆరు
మనకు ఋతువులు ఆరు
మూడు మూళ్ళు తొమ్మిది
మన గ్రహాలు తొమ్మిది
మూడు నాలుగులు పన్నెండు
మన మాసాలు పన్నెండు
మూడు అయిదులు పదిహేను
మన తిథులు పదిహేను
మూడు ఆర్లు పద్దెనిమిది
మూరకు అంగుళాలు పద్దెనిమిది
మూడు ఏళ్లు ఇరవై ఒకటి
గినీకు షిల్లింగులు ఇరవై ఒకటి
మూడుఎనిమిదులు ఇరవైనాలుగు
దస్తాకు కాగితాలు ఇరవైనాలుగు
మూడుతొమ్మిదులు ఇరవై ఏడు
మన నక్షత్రాలు ఇరవై ఏడు
మూడు పదులు ముప్ఫై
నెలకు రోజులు ముప్ఫై

రచన :
కోరుమల్లి ఈశ్వరచంద్ర విద్యాసాగర్
(గణపవరం)



త్వరలో విడుదల కానున్నది!

# బోసు వీరుల
## అమరగాథ

# "ఢిల్లీ - ఛలో!"

(అజాద్ హింద్ ఫౌజ్ యొక్కయు, నేతాజీ సుభాష్‌చంద్రబోసు యొక్కయు పూర్తి చరిత్రనుతెల్పు అసమాన గ్రంథము)

రచయిత: జి. జె. రావు బి. గుప్త

(పై గ్రంథము చక్కని ఆర్టు బొమ్మలతో తెల్లని గ్లేజుకాగితముపై బహు చక్కగా ముద్రింపబడినది.)

ఏజంట్లకు మంచి కమీషన్ ఇవ్వబడును.

వివరములకు:

**శ్రీ దుర్గా బుక్ డిపో**

ఒంగోలు (గుంటూరుజిల్లా)



రచయిత

# బావతో హాస్యం!



పొట్టిబావ

## పదివేల బావ!

బావోయ్! బావా!
పదివేల బావా!
నీ మాట
నీ యాట
నీ సూటు
నీ బూటు
పదివేలోయ్ బావా!
పరువున్న బావా!
అక్కయ్యా
అమ్మా
పిలుపెట్టి నారోయ్
బావయ్య రావోయ్
ఫలహార మిందోయ్.

రచన: చేబోలు సుబ్రహ్మణ్య శర్మ,
(తిరుపతి)

## మా బావ కథ

మా బావ వచ్చేడు
పిల్లి పీట వేసింది
నక్క నలుగు పెట్టింది
కుక్క కూడు పెట్టింది
కోడి కూత వేసింది
పాము పప్పు వేసింది
నెమిలి నెయ్యి వేసింది
పునుగు పులుసు వేసింది
పులి పులిహోర వేసింది
ఆవు అరిసె వేసింది
చేప చారు వేసింది
పేను పెరుగు వేసింది
బావా! తిను!
పంది పరుపు వేసింది
బావా! పడుకో!

రచన: కొల్లా సుసీల,
(కాకినాడ)



# అక్కతో 5 నిమిషాలు

చిట్టి చెల్లాయిలూ!

చిట్టి తమ్ముళ్లూ!!

రోజులు గబగబా నడుస్తున్నాయి! అప్పుడే శ్రావణ మాసం దాటిపోయి భాద్రపదం వచ్చేసింది. దసరా పండగలు అదుగో ఎదురుచూస్తున్నాయి. బొమ్మల కొలువుల్లో కూర్చుందామని కొత్తబొమ్మలు ఉవ్విళ్లూరుతున్నాయి. గాలికి ఎగిరే రబ్బరు బొమ్మలకు దారాలుకట్టి ఎగురవేస్తున్నారు కదూ! అందరికీ ఆనందం, సంతోషంగా వుండాలనేవుంది.

కాని, ఇటువంటి సమయంలో మనం బీదవాళ్లని మరిచిపోకూడదు. పండగరోజుల్లో బీదవారికి మీకుతోచిన సహాయం చేస్తారు కదూ!

"అక్క"

## బాల సంఘాలు

**కదిలేడు బాలసంఘం:**

ఆగస్టు 25 తేదీని ఆరోగ్య మహాసభ జరుపబడెను. ఆటపోటీలు, విజ్ఞాన పోటీలూ, ఉత్సవాలూ జరిగాయి. సాయంత్రం సభలో శ్రీ అలమితి నావూరు రెడ్డిగారు అధ్యక్షత వహించేరు. శ్రీయుతులు కామేశ్వరరావు, సి. రాఘవయ్య, తాడి సుబ్బయ్యగార్లు ఆరోగ్యము, బాలసంఘాలు మొదలగు విషయముల గురించి ఉపన్యసించారు. పోటీలలో గెలిచినవారికి బహుమతులతో సభ ముగిసింది.

**రామచంద్రపురం బాలసంఘం:**

స్థాపితం జులై 15 తేదీ. 20 మెంబర్లు వున్నారు. ఆటలు పోటీలు జరుగుతున్నాయి. శ్రీ దే. బ్రహ్మావధాన్లు గారు కార్యదర్శి.

**శ్రీపతి బాలసంఘం: (అచ్చనపల్లె)**

స్థాపితము ఆగస్టు 17 తేదీని. శ్రీ డి. లక్ష్మీపతిగారు అధ్యక్షులు; పి.

గంగిరెడ్డిగారు కార్యదర్శి. శ్రీ ఎస్. సమ్మూ సాహెబ్‌గారు బాల సంఘాల గురించి మాట్లాడేరు. ఈ సంఘములో 35 గురు మెంబర్లుగా చేరారు.

గార్ల బాలసంఘం : (నైజాం)


ఆగస్టు 12 తేదీని సభ జరిగింది. 200 లకు పైగా బాలురు వచ్చారు. అక్కడి స్కూలు సరిగాలేక చాలా మంది బాలురు బాధపడుతున్నారు. గనుక ఆ స్కూలును వెంటనే బాగు చేయమని ప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానము చేశారు.

తాడేపల్లి బాలవిద్యార్థికాంగ్రెసు:

ఆగస్టు 9 తేదీని యీ సంఘము వారు స్వాతంత్ర సమర దినోత్సవం జరిపారు.

పెనుగొండ బాలసంఘం :

బాలసంఘ సభ్యులు శ్రీ టి. విశ్వనాథంగారి యింట్లో "ఉత్తర గోగ్రహణము" అను చిన్న నాటకమును వేశారు. శా॥ సీతారామచంద్ర రావు, రాధాకృష్ణ, ఇందిరాకుమారి, నారాయణమూర్తి, చక్రపాణి, సత్యనారాయణమూర్తి, రాధాకృష్ణ వేషాలు వేశారు.



నాటకంలోని వేషాలు

కూర్మనాథపురం బాలసంఘం :

ఈవూరు ప్రాథమిక పాఠశాల యొక్క వాదోపవాద సంఘం జులై నెలలో స్థాపించబడింది. శ్రీ పి. శ్రీరాములు కార్యదర్శి జి. కమలాకుమారి సహాయ కార్యదర్శి. బాలభట సంఘమునకు శ్రీ ఎస్. ఎస్. మూర్తిగారు అధికారి.

అనకాపల్లి బాలసంఘం :

త్వరలోనే ఏర్పడుతుందని వినుటకు సంతోషము. క్రొత్త బాలసంఘమునకు జయమగుగాక !

59-వ పేజీలోని పొడుపుకధలకు జవాబులు :

1. తాటికాయ; 2. అత్తిచెట్టు; 3. రూపాయి; 4. జింకలు

# మా తాత తో

(ప సి (డి) భా వా లు)

ఎన్ని బొమ్మలో! బాల నిండా లంగు లంగుల బొమ్మలే! పాత లూ, మాతలూ, అన్నీ చదూత! గబగబ గుణింతాలు నేచుకుని బాలంతా చదివేత్తా.

తాతా! నువ్వు అచ్చలాలన్నీ మలిచిపోతావుట! నీకు చదువు లాదుట! నేను బాల అంతా చదివి నీకు వినిపిత్తా!

ఊహుఁ... ! నీకు చూపించను! నన్ను బయస్కోపుకి పంపించావా ఏమిటి? నేను పడుకున్నాక 'బాల'ని తీసి, చదివేసి నలిపావంటే తంతాను! నే లేనప్పుడు ఎవలూ ముత్తుకోకూడదు! మా 'బాల' మడి! తెలిసిందా తాతా ?'

హే! హే! తాతా! నీ పంచాంగంలో ఇన్ని బొమ్మలూ, లంగులూ లేనేలేవు! మా 'బాల' తో నీ పంచాగం పనికిలాదులే!

నువ్వు లామాయణం బాగా చదవగలా, నేను బాల చదివినంత బాగా? పందెంకత్తు తాతా! నీపులాణానికి పదిమందే నాలాలు! నేను బాల చదువుతానంతే మా బలంతా ఇక్కలికొత్తుంది!

తాతా! నీ పంచాంగం ఏలాది కొక్కమాలే ఒత్తుంది, మా 'బాల' నెలనెలా ఒత్తుంది!

నా మాత విని నువ్వూ నా అంత అయిపోతావా! బాలను నీ కిత్తాను.

"మహేశ్వర్"

# డ

వాడలో కెల్ల అది పెద్ద మేడ

మేడ నాల్గువైపుల ప్రహారి గోడ

గోడ నలుగడల సురతరుల నీడ

నీడలో బాలబాలికల క్రీడ

క్రీడ క్రీడకును పూవులల్లాడ

క్రీడ కాదు కాదది స్వర్గజాడ

జాడయునుకాదు - స్వర్గమేచూడ!

రచన:

నాగవోలు వెంకట అప్పారావు

(పాలకొండ)


## అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

సం॥ చందా: రు 6. విడిపత్రిక అ 8.

ప్రధాన సంపాదకులు: చదలవాడ పిచ్చయ్య

సంపాదకవర్గం:

జలసూత్రం రుక్మిణీనాధశాస్త్రి

కొడవటిగంటి కుటుంబరావు

తుమ్మల వెంకట్రామయ్య

ప్రయాగ కోదండరామశాస్త్రి

ప్రచురణ కర్తలు:

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం,

గవర్నరుపేట - బెజవాడ





పండిత్ డి. గోపాలాచార్యులవారి

అరుణ

గర్భాశయరోగ నివారిణి.




అరుణ ఋతుదోషము లను పోగొట్టి, పరిపూర్ణ స్త్రీత్వమును ప్రసాదించగల స్వయం సంపూర్ణమగు ఔషధము. అట్టి దానిని విడువక సేవించినట్లయితే, మిమ్ము ఆరోగ్యవంతులను జేయుటయేగాక, మీ జీవన పరమావధియగు అమందానందమును తప్పక యొసగును.

ఆయుర్వేదాశ్రమం, లిమిటెడ్

టి-నగర్. . . . మద్రాసు.

EASTERNS 378.

# నీ తెలివి ఎంత?

[గత సంచికలో వేసిన ప్రశ్నలకు జవాబులు]

★ నక్షత్రము సూర్యునికంటే పెద్దదైనా, మనకి ఎక్కువ దూరంగా వుండడం చేత చిన్నదిగా కనపడుతుంది.

★ మంచుముక్క నీటికంటె తక్కువ బరువు గనుక తేలుతుంది.

★ ఉప్పు నీట్లో కరిగి మాయమౌతుంది.

★ ఉప్పు గుండ, గడ్డలు.

★ నీటిలో ఇసక పోసినా, అది కరగదు.

★ చిన్ని కిష్టమ్మకి వాళ్ళమ్మ వెన్నముద్ద ఇచ్చినట్లే మా అమ్మ మాకు వెన్న ముద్దలివ్వాలి ; మేం తినాలి.

★ కొందరం కాఫీ తాగుతాం. కాని, దానికి బదులు బువ్వ పెడితేనే మంచిది.

★ బువ్వ చల్లారితే బాగుండదు. అది అరగాలి కదూ : అంచేత వేడిగావుండాలి.

★ ఒళ్ళు కడుక్కునే బువ్వ తినాలి. కడుక్కోకపోతే వంటిచెమట, మన్నుతో అసహ్యం వేస్తూవుంటాం.

★ ఆడుకుంటాం. ఆనందానికీ, ఆరోగ్యానికీ.

చాగంటి వీరభద్రరావు, (విజయనగరం)

# పట్టుకో సంపట్టు!

చిట్టి పాపకి - పొట్టి లాగౌహాటి
కొట్టు నుంచీ - పట్టుకొస్తే
పట్టు కాదని - కొట్టి వేసింది!
గట్టి లాగిది - కట్టుకోమని
ఒట్టు పెట్టుకు - గట్టిగా నన్నా
పట్టు తెమ్మని - పట్టు పట్టింది!

రచన: కొండేపూటి వ్యాఘ్రేశ్వరరావు, (కెంపెదపూడి)

# చిట్టి బాల

'రమాకుమార'

చిట్టి చిట్టి బాల
చిన్నారి బాల
పుట్టి ఓ యేడాది
ఇట్టె గడిచింది !

*

చిట్టి పొట్టి కథలు
చిన్నారి కతలు
ఎన్నెన్నొ నేర్చింది
చిన్నిమా బాల !

*

బాల పలుకులన్ని
బంగారు గనులు ;
బాల పాడినపాట
బంగారుమూట !

*

బాలమెట్టిన యిండ్లు
భాగ్యాలోగిండ్లు
బాలత్రొక్కిన పొలము
బంగారు ఫలము

*

'బాల' శ్రీకరు దయచె
ప్రాభవంబంది
వర్ధిల్లు గావుత
విశ్వమ్ము నందు !!!




జమ్మి వెంకటరమణయ్య గారి 'లివర్ క్యూర్' ప్రసిద్ధిగాంచిన వైద్యులు దీనిని వైద్య శాస్త్రములలో కెల్ల నొక విజయోత్సవముగా శ్లాఘించుచున్నారు.

అందరి కెమిస్టుల వద్ద దొరుకును; లేనిచో క్రింది విలాసమునకు వ్రాయుడు.

జమ్మి వెంకటరమణయ్య & సన్స్
1/1, బ్రాడీస్ రోడ్డు, మైలాపూర్, మద్రాసు.
ఇంకను : బొంబాయి, కలకత్తా, లక్నో, బెంగళూరు, తిరుచిరాపల్లి విజయనగరములందు కూడ ఆఫీసులు గలవు.

# బాల బహుమానాలు

ఈ నెల "బాల" చందాదారుల లాటరీలో ఈదిగువవారికి బహుమానాలు వచ్చాయి :

| | చందా నెం. |
|---|---|
| చి॥ రంగనాయికమ్మ (కశింకోట) | 151 |
| D. గంగిరెడ్డి (సాలగిరి) | 847 |
| శెక్రటరీ, రాఘవేంద్ర రావు గ్రంథాలయము (పెదముద్దలి) | 846 |
| V. హనుమంతు నాయుడు (ఎల్లంపేట) | 490 |
| D. V. రంగనాథం (దొడ్డఘట్ట) | 223 |
| G. శ్రీహరి, (ఎలమంచిలి) | 70[illegible] |
| Ch. నాగేశ్వరరావు (పందలపాక) | 577 |
| G. శేషరాజ తల్పశాయి (అత్తిలి) | 867 |
| B. S. నాగమాణిక్యం అండ్ బ్రదర్సు (దౌలతాబాద్) | 896 |
| ప్రొప్రయిటర్, శ్రీ మారుతీ జనరల్ స్టోర్సు, (కానూరు) | 992 |

పద్యాల్లో ప్రశ్నలకు జవాబులు:

1. మునగ; 2. వావిలి; 3. తామర;
4. కొబ్బరికాయ.

# "బాల" రాగానే

వచ్చే వచ్చే మాబాల
జైహింద్ అనుచు మాబాల
ఆంధ్రపతాకము మాబాల
ఎగురవేయుచు మాబాల
అష్టమిదినమున మాబాల
కృష్ణునివేడుచు మాబాల
బాలరాకతో మాబాల
ఖర్గపురమున మాబాల
హిందూ ముస్లిం మాబాల
ఏకమయ్యేరా మాబాల
బాలరాకతో మాబాల
స్వరాజ్య మొచ్చెను-మాబాల

రచన : శ్రీ॥ రాములు నాయుడు
(ఖర్గపురము)




"గృహప్రవేశం"లో ఒక దృశ్యం



# ఇది చెప్పుకో చూద్దాం ???

## I చదరము



ఈ బొమ్మను నాలుగు ముక్కలుగా కోసి తిరిగి అతికినచో అది ఒక చదరము అగును. ఎట్లు ?

సంపాదన: నిడమర్తి నరసమాంబ, (శ్రీకాకుళం)

## II ఏమిటి ?

ఆకాశంలో ఒంటరిగా నుండేది, ఆకారంలో అలాగే వుండేది, ఆశలో వుండేదే ఆనందంలో నుండేది ఏమిటి ?

సంపాదన : "అనంత"

# ఆగస్టు 'బాల' లోని ప్రశ్నలకు జవాబులు

## I

## ఎన్ని గదులు

51 గదులు

## II

## ఎన్ని తప్పులు

పెద్దతప్పులు రెండు వున్నవి అవి ఏమనగా :—

(1) సూర్యుడు ఎదురుగావుంటే, నీడ వెనుకకుపడును గనుక నీడలు తప్పుగా వేయబడ్డవి.

(2) బీచిమీద జండా గాలికి ఎదురుగా ఎగురుచున్నది. అదితప్పు. గాలి ఏ వైపు వీచునో ఆవైపే ఎగరవలెను.

సరియైన జవాబులు పంపినవారు ఇద్దరే :

ఏలూరు :

N. Ch. V. రామావతారం.

రాజమండ్రి :

వాళ్ల చెరువు బదరీ నారాయణరావు.

# జులై 'బాల' లోని

ప్రశ్నలకు సరియైన జవాబులు పంపినవారు :—

విజయనగరం :

డి. వి. రమణారావు; డి. వి. క్రిష్ణారావు; జి. చిన్న బాబాజీరావు; జి. బాబాజీరావు; జొ. వి. రామారావు; టి. వి. శ్రీరామం; టి. పద్మనాయకి; ఆర్. జయలక్ష్మి; ఆర్. యన్. సంతోషకుమార్; య. రామకృష్ణ పరమహంస; య. వి. రామయ్య; య. నారాయణమూర్తి; యస్. యల్. రావు; య. సుకన్య; య. నారాయణమూర్తి; యస్. వెంకటరత్నం; యస్. రాధామణి; శ్రీ రామక్రిష్ణారావు; యం. వంకజం; యస్. నారాయణమూర్తి; గ. మన్మధరావు; వి. సరస్వతి; వి. కుసుమవల్లి; వి. లక్ష్మి; అ. జగన్మోహిన; అ. లలిత; సి. హెచ్. యన్. శాస్త్రి; యం. వి. సూర్యనారాయణ; యం. వి. నరసింగరావు; యం. వి. జగ్గమ్మ; గో. వె. రమణమూర్తి.

విశాఖపట్నం :

పి. బాల లక్ష్మణరావు; పి. శ్యామలరావు; వే. వాసుదేవరావు; వే. లక్ష్మీభాయి; వే. సుబ్బారావు; క. జగదీశ్ చంద్ర రెడ్డి; క. రామలింగ రెడ్డి; క. లక్ష్మణ వేమన రెడ్డి; యన్. సుధాకర్; మ. నానాజీరావు; మ. పరంజ్యోతి; మ. గృహలక్ష్మి; మ. సత్యవతి; ఇ. వి. రమణారావు; ఇ. శంభులింగం; ఇ. హనుమంతరావు; ఇ. కృష్ణవేణి; యమ్.

రామకృష్ణారావు; యస్. నరసింగారావు; వ. క్రిష్ణారావు; వి. యజ్ఞయ్య; వి. లక్ష్మణరావు; వి. సుశీల, పి. సరోజ; కె. అరవిందకుమార్; కె. రవి; వి. శ్రీనివాసరావు; చే. రామకృష్ణమూర్తి; యం. వి. యన్. ఆర్. చంద్రయ్య; యం. లీలావతి; వై. రామారావు; వై. కృష్ణారావు; వై. లక్ష్మణరావు.

బరంపురం :

య. వి. రంగశాయి; యమ్. విమల; బి. జగన్నాధరావు; న. శేషగిరిరావు; న. విఠల్ రావు; మో. జానకిరాం; కొ. భీమారావు; కొ. కమల; ప్ర. రామారావు; ప్ర. సుబ్బారావు; టి. సన్యాసిరావు; టి. సిహెచ్. సన్యాసిరావు; ల. రామారావు; కా. గజపతిరావు; పి. దివాకరరావు; బ. విజయలక్ష్మి; ఎ. వెంకటరమణ; గో. జగన్నాధస్వామి.

కడప: యస్. సుబ్బారెడ్డి; యన్. పకీరుస్వామి నాయుడు; తిరుపతి: ఆనంద; సి. శ్రీనివాసరావు; సికింద్రాబాదు: బి. ముక్తాభాయి; టి. లక్ష్మి; ఉప్పటూరు: బె. వెంకటేశ్వరులు; బల్లిపర్ర: జె. రుక్మిణీదేవి; గుంటూరు: జె. సుందరరామశాస్త్రి; వి. బాబు; వి. కుమారి; వి. అన్నాజీ; వి. మోహన్ కిషోర్; వి. రామకృష్ణ; ధవళేశ్వరము: గం. వెంకటరత్నం; శ్రీ. బ్రహ్మానంద రావు; టెక్కలి: బి. హెచ్. ధణీంద్ర ప్రసాద్.

మచిలిపట్టణము :

వి. వి. క్రిష్ణానంద మోహన్; వి. రామబ్రహ్మానందరావు; టి. ది. శంకరసింగ్; వి. రాజ్యలక్ష్మి; ఖ. రధాకృష్ణ; మా. గోవిందాచారి; మా. ఇందిరాదేవి; టి. బి. హీరా మాన్ సింగ్; టి. బి. బాలాజీసింగ్; డి. జగన్ మోహన్ రావు; వ. అనసూయాదేవి; ల. వె. ప్రభాకర శర్మ; ల. పద్మావతీదేవి; ల. కోటేశ్వరరావు; ని. లక్ష్మి నరసింహ శాస్త్రి; తు. భాస్కరరావు; తు. మాధవరావు; యన్. రాధాకృష్ణమూర్తి; జె. ఐ. మురళీ కృష్ణమూర్తి.

పాలకొల్లు: పి. సీతారామయ్య; యమ్. యల్. నరసింహారావు; చ. వెంకటేశ్వరరావు; కె. సత్యనారాయణమూర్తి; శ్రీ. వెంకటరత్నం; చి. వెంకటేశ్వరరావు; పి. వెంకటలింగం; సి. ఆంజనేయులు.

ఏలూరు :

యం. పి. మూర్తి; గా. శ్రీరామమూర్తి; ఆ. మణ్యం; కె. ఏకనాథశాస్త్రి; జి. గోపాల క్రిష్ణమోహన్; జి. సావిత్రి; బి. హెచ్. వి. జోగరాజు.

నర్సాపురం: చావలి మధు; చా. రామారావు; సి. మంగయ్య శర్మ.

యలమంచిలి: పి. వి. రమణమ్మ; జి. వి. కె. హనుమాయమ్మ.

కొవ్వూరు: కె. జానకీదేవి; క. రాఘవేంద్రరావు; కా. కాశీ విశ్వనాధరావు; కో. బుబ్బారావు; కో. లక్ష్మి నారాయణ. రాజమండ్రి: కా. పి. విశ్వేశ్వరరావు; వై. కృష్ణమూర్తి; సూ. వెంకట నరసింహ దీక్షితులు; దా. సంకర్షణరావు; తం. కృష్ణమూర్తి. తెనాలి: కె. ధనలక్ష్మి; వై. సత్యవతి; పి. కామేశ్వరి.

అనంతపురం: మా. పార్థసారధి;

మా. భాస్కరరావు. కొంతేరు: వై. శ్రీరామమూర్తి. నంద్యాల: ఆర్. పి. చైతన్య. తిరుచినాపల్లి: స్వర్ణకుమారి చౌదరి సుజాతచౌదరి. పాలూరు: వె. వెంకటరాజు. కాకినాడ: యమ్. వెంకటరమణ; యన్. సూర్యనారాయణ. ఛత్రపురం: స. వి. రమణయ్య. రేపాల: క. వి. నారాయణరావు. బెజవాడ: ర. దవో నందు; పి. పూర్ణచంద్రారావు. ఒంగోలు; కు. దక్షిణామూర్తి శాస్త్రి. పావిహుండాం: జ. నారన్నాయుడు. మద్రాసు: యన్. రాఘవేంద్రరావు; యన్. గోపాలక్రిష్ణ; యన్. భారతీదేవి; వా. సూర్యనారాయణ. పెనుగొండ: టి. సీతామహాలక్ష్మి; టి. రాజేశ్వరి; టి. రామారావు; టి. ఇందిరాకుమారి. శ్రీకాకుళం: కు. పూర్ణశేఖర్; యమ్. యల్. నరసింహం. మారుతేరు: జి. శివరావు.

ఊరిపేరు లేదు:

తు. భాస్కరరావు; తు. మాధవరావు; ల. వి. ప్రభాకర శర్మ; అ. కోటేశ్వరరావు; ని. నక్ష్మి నరసింహశాస్త్రి; మ. వెంకటేశ్వరులు; అ. పన్మాపతీదేవి; ల. వేణుగోపాలరావు; ప. శ్రీధర్; పె. వె. రత్న భాస్కర్; క. సుబ్రమణ్యం; క. నాగేశ్వరరావు; క. శేషమ్మ.


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే
బాధపడుచున్న యెడల వెంటనే
పాత్రుడు గారి
# బాల సంజీవిని
యీయండి
ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:—

డా॥ పిల్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,
11. దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి;
నెం. 15, పుగళై పిళ్ళై వీధి,
తెప్పకొలం.

## ఆంధ్రమహిళా సభ

### (మదరాసు)

ఈ సభ గత 5 సంవత్సరాలనుంచి మదరాసులో ఆంధ్రమహిళలకు సేవ చేస్తోంది. ఇన్నాళ్ళూ అద్దె ఇళ్ళలోనే గడుపుతూవుండడం చాలా కష్టంగా వుండేది. అంచేత మొదట శ్రీ మిర్జాపురం రాణీగారి విరాళంగా మైలాపూరులో స్థలం కొన్నారు. పిఠాపురం, బొబ్బిలి జమీందారులు, శ్రీరావు రాజ్యలక్ష్మీదేవి మొదలగు వారి విరాళముల ఫలితంగా:

శ్రీ చిన్నమాంబా విద్యామందిరము.

శ్రీ మల్లమదేవీ మందిరము.

శ్రీ రాజ్యలక్ష్మీ పారిశ్రామిక మందిరము,

శ్రీ సీతాలక్ష్మీ భోజనమందిరము

ఆ స్థలములో కట్టబడ్డాయి.

మొన్న ఆగస్టు 17 తేదీని వీటి ప్రారంభోత్సవం శ్రీమతి సుచేతా కృపాలిని వారిచే జరుపబడింది. ఆ మర్నాడు శ్రీ ఎల్లెన్ శర్మగారి అధ్యక్షతను సభ 5 వ వార్షికోత్సవం జరిగింది. ఉపన్యాసములు, నాటికలతో రెండు రోజులూ జయప్రదంగా గడిచాయి.

ఈ సభ కార్యదర్శిని శ్రీ దుర్గాబాయమ్మగారు చేస్తున్న సేవకు మా జేజేలు.

## "ఆంధ్ర శిల్పి"

శ్రీ వి. ఆర్. చిత్రా, పి. గణపతిశాస్త్రిగార్ల సంపాదకత్వమున వెలువడిన యీ సంచిక ఎంతో చక్కని అచ్చుతో, చక్కని వ్యాసాలతో, బొమ్మలతో మా కార్యాలయం చేరింది.


ఇందులో శ్రీ ప్రకాశంపంతులు, చింతా దీక్షితులు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, వి. ఆర్. చిత్రా, భమిడిపాటి, మునిమాణిక్యం, శివరాజు, విశ్వేశ్వర రావు, పఠాభిగార్ల చక్కని రచనలు వున్నాయి. మొదటి సంచికలో లాగే ఇకముందుకూడా యీపత్రిక ఆంధ్రకళలకు, వాఙ్మయానికి ప్రధానస్థానం ఇస్తుందనిఆశిస్తున్నాం. వెల 12 అణాలు దొరకుచోటు:-"ఆంధ్రశిల్పి" 10 నరసింగపురంవీధి మౌంటురోడ్డు,మద్రాసు.

## పడోసి

పడోసీ 5 వ జన్మదిన సంచిక అందుకున్నాం. 98 పేజీల యీ సంచికలో ఆనేల ప్రత్యేక వ్యాసాలు, చిత్రాలు. 'మహేశ్వర్',అకొండరామకృష్ణ, 'జంగం'కె. లింగరాజు, కె.సభ, 'మధుమూర్తి' మొదలగు వారి రచనలువున్నాయి.

ఎడిటర్ చంద్రశేఖరంగారు చాలా వుత్సాహంతో యీ సంచిక తమ సొంత ప్రెస్సులో తయారు చేసినందులకు ధన్యులు. సంచిక వెల 12 అ.

"బాల" ఏడాది చందా రు. 5-0-0 లు
(ప్రత్యేక సంచికతో సహా) వి. పి. పద్ధతిలేదు.




# పిల్లల తెలుగు ప్రోగ్రాముల వివరాలు

[211 మీటర్లు, 31.36 మీటర్లమీదా వినొచ్చు.]

[మధ్యాహ్నం 2-15 నుంచి 3 వరకు]

## సెప్టెంబరు

### 1 వ తేదీ ఆదివారం

రారె చిన్ని పిల్లలార - పిలుపుపాట; ఉత్తరాల సంచీ; చెవిటి మాలోకం ; నాటిక; పుట్టింరోజులు; దోమా దీపము (పాటకథ) - మీ కథలూ పాటలూ; చిక్కుప్రశ్న; పోదామా.

### 8 వ తేదీ ఆదివారం

రారె చిన్ని పిల్లలార - ఉత్తరాల సంచి-వానమూర్తి (నాటకం); పుట్టిం రోజులు; పొట్టిబావ (పాట); భూమి పొడుంకాయ (నాటకం);మీపాటలూ, కథలూ, చిక్కుప్రశ్న; పోదామా.

### 15 వ తేదీ ఆదివారం

రారె చిన్ని పిల్లలార - ఉత్తరాల సంచీ; శ్రావణ భాద్రపదాలు (నాటకం); పుట్టింరోజులు; తాతయ్య కథ; ఎర్రజండా (నాటిక); మీ పాటలూ, కథలూ, చిక్కుప్రశ్నలు-పోదామా.

### 22 వ తేదీ ఆదివారం

రారె చిన్న పిల్లలార ; ఉత్తరాల సంచీ ; జోడు గుర్రాలు (నాటిక) ; పుట్టినరోజులు ; మిరపకాయ స్వీయ చరిత్ర ; చిక్కు ప్రశ్న; మెలికిమాట ; పోదామా.

### 29 వ తేదీ ఆదివారం

రారె చిన్న పిల్లలార; ఉత్తరాల సంచీ; తమాషాల గుత్తి (రూపకం); పుట్టింరోజులు; తెలివిగల కుక్కల గురించి కథలు; చిక్కు ప్రశ్న; కథలూ, కబుర్లు; పోదామా.

Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras. Printed by B. Nagi Reddy at B. N. K. Press, 37, Acharappan St,, G. T. Madras,

# బాల

## చందా వివరాలు

సంవత్సర చందా : రూ 5/-

(ప్రత్యేక సంచికతో సహా)

అర్ధ సంవత్సరం చందా లేదు

వీ. పీ. పద్ధతి లేదు.

★

*Advertisement Tariff:*

SINGLE INSERTION


| | | |
|---|---|---|
| INSIDE FULL PAGE | Rs. | 50 |
| ,, HALF PAGE | ... | 30 |
| WRAPPER II & III | ... | 75 |
| LAST COVER (2 col.) | ... | 120 |

★

## 'BALA'

**20, SUNDARESWAR ST.,**

**MYLAPORE MADRAS 4.**




అన్ని నొప్పులనూ పోగొట్టే

అందాల బాల

# అమృతాంజనము

PRINTED AT THE B. N. K. PRESS, MADRAS 1